# ఆంధ్రభూమి

సర్వవిషయములను చర్చించు
సచిత్రాంధ్రమాసపత్రిక.

స్థాపితము ౧౯౩౩.
సాలుచందా 1-8-0.

సంపాదకుడు :
ఆంధ్ర శేషగిరిరావు, బి. ఏ.

సంపుటము : ౪.  ధాతు, చైత్రము : ఏప్రియల్, 1936.  సంచిక : ౧౦.


## కలకలనవ్వు

[తెనుగు కవుల రచనములలో పలుతెఱగుల నవ్వులుకలవు. గౌరన 'మంచివెన్నెల వంటి మందహాసము', 'చీకటివిరియించు చిన్నారినవ్వు'; శ్రీనాథుని 'ముసిముసినగవు'; భమిటిపాటివారి 'ప్రియుని కౌఁగిటిలోని ప్రియురాలినవ్వు', 'పాలబుగ్గలమీఁద పసిబాలనవ్వు'; నన్నయ్య 'శుచిస్మితము', రాయల 'అంకురితస్మితము' మున్నగునవి ఒకపాటివి. తిక్కన సోమయాజినవ్వులకు లెక్కలేదు: పిన్ననవ్వు, కన్నులనవ్వు, కన్నులనిప్పులురాలనవ్వు, పెలుచనవ్వు, కినుకమునుంగునవ్వు, కినుకనూనిననవ్వు, నవ్వుగానినవ్వు, ఎఱ్ఱనవ్వు, కటికినవ్వు, ఉద్ధతమందస్మితము, అనాదరమందస్మితము, కలకలనవ్వు—ఇంకను ఎన్నియోగలవు. వీని అన్నిటియందును కలకలనవ్వుపై ఆంధ్రకవులకు అభిమానము హెచ్చు. అట్టి కలకలనవ్వు ఈ పద్యమున 'నిల్చిపొల్చినగతిని' అందముగా వర్ణితమైయున్నది.]

చ. కలకలనవ్వు పాలతరగల్ నురగల్ చిరుగాలి యూఁపులఁ
పలికినయట్లు, వెన్నెలల పాతరదీసి వరాల మానికం
గొలిచినయట్లు, కాంతి వెదగుప్పు నెరాహురుమంజిముత్తెముల్
చిలికినయట్లు, జాజిపువ్వురేకుల దుప్పటి కప్పినట్లుగా.

—శతపత్రమునుండి.

# వెనుకటి ధాతుసంవత్సరపు కఱవు కథ

[మన మిపుడు ధాతుసంవత్సరమున ప్రవేశించినాము. 'ధాతు' శబ్దము చెవిని బడుటతోడనే ఆంధ్రులలో పలువురకు ధాతువులాడవు. కారణము అఱువదియేండ్ల క్రిందటి ధాతుసంవత్సరమున గొప్పకఱవు పెచ్చరిల్లియుండుటయే. మదరాసు రాజధానినంతను వీరవిహారముగావించి విశేషప్రజానష్టమునకు, పశునష్టమునకు కారణమైన వెనుకటి ధాతుసంవత్సరపు కఱవును ప్రత్యక్షముగ అనుభవించిన తరమునకు మనము తరువాతివారమే అయినను ఆదినములలో నీళ్ళలో రాగిడిమట్టి కలుపుకొని త్రాగియు, ఆముదకాయలు భుజించియు, పచ్చిగడ్డి పచ్చడిగా చేసికొనితినియు ఉసురులు నిలుపుకొనినవారు ఇంకను కొందరు మననడుమ జీవించియున్నారు. ఆముదుసళ్ళనోళ్ళవెంటవచ్చు నాటిగాథలగూర్చిన పలుకులు వినుచో నేడును మన హృదయములు తూలి, వీలి, తునియలై లక్కవలె కరుగును. 'ప్రతిదినంబు దివి నిరీక్షించు దేవమాతృకలగు' వత్తమండలములేగాక నదీమాతృకలగు కృష్ణాగోదావరిమండలములుకూడ ఆనాడు దుర్భరదుర్భిక్షదోషమునకు దోసిలి యొగ్గినవి. ఈవ్యాసమున ఆధాతుకఱవుచరిత్ర వివరింపబడుచున్నది.]

అఱువదియేండ్ల క్రిందటి భావసంవత్సరమున అక్టోబరు, నవంబరు నెలలలో అధికవర్షములు కురిసినను పంటలు బాగుగాపండుటచే ధరలు బాగా తగ్గిపోయెను. 1875 ఏప్రియల్ 7-వ తేదీని యువ ప్రారంభమైనది. అది 1876 మార్చి 25-వ తేదీతో ముగిసినది. ఆయేడు తొలకరివానలు ఏమికురిసినవో, అంతే తిరిగి వానలులేకుండగనే యువ వెళ్ళిపోయినది. వానలులేక చేలు వాడిపోయి పంటల నెగబెట్టినవి. భావలో తగ్గినధరలు యువలో హెచ్చిపోయెను. ధరతగ్గుట హెచ్చుకొఱకె తథ్యము సుమతీ! అను వాక్యము సార్థకమయ్యెను.

... ... ...

అట్టి పరిస్థితులలో 1876 మార్చి 26-వ తేదీని ధాతుప్రవేశించినది. తొలకరి వానలు లేవు, కార్తికమాసపు కడవానలు లేవు. కురిసిన కొద్దివానలును అకాలమునకురిసి కృషికృత్యములకు అనుకూలములు కాకుండుటకు తోడు ప్రత్యక్షముగ ప్రతికూలములైనవి. ఆయేడు ఒక్క గంజాము, విశాఖపట్టణము మండలములందు మాత్రము వర్షములు తూకముగ పడినవి. అయితే వర్షములు కురిసినవను సంతోషములేకుండ ఆజిల్లాలలోని నదులు పొంగి పంటలను పచ్చము పాడొనర్చినవి. అక్టోబరుమాసమున విశాఖపట్టణము, శ్రీకాకుళము ప్రాంతములు గొప్పతుపానుగాలికి, వానముసురునకు గుఱియయ్యెను. విశాఖపట్టణమున ఈగాలివానకు నలుబది ఇద్దరు మరణించిరి, కారాగారమందిరము కూలిపోయెను, ఖైదీలు పారిపోకుండ పట్టుకొనుటలో పోలీసువారు అలిసి పులుసుకూరయైరి. శ్రీకాకుళమున లాంగుల్యానది పొంగి వంతెనను కొట్టివైచినది. ఊరంతయు నీటిలో మునిగిపోయెను. ఫలితముగా పదమూడువందల గృహములు కొట్టుకొనిపోయెను. మూడురోజులకుగాని వరదనీరు తియ్యలేదు. ఈవర్షాధిక్యమువలన ఆ రెండుజిల్లాలలోని ఎన్నియో చెఱువుకట్టలు తెగిపోయినవి. ఈకారణమున అచట తరువాత నీటికఱవు ఏర్పడెను.

... ... ...

పలుచోట్ల అనావృష్టిదోషము, కొద్దిచో

ట్లు అధికవృష్టిదోషము. పంటలు సర్వనాశనమగుటలో నాశ్చర్యమేమి ? యువలోనే పంటలు చెడుటచే ధాతు ప్రవేశించుసరికే పదార్థముల ధరలు పెరుగుచుండెను. ధాతులో తొలకరివానలు లేకుండుటతో ఈధరలు మఱింత పెరుగుదల చూపెను. కార్తికమాసపు కడవానలుకూడ ఎగబెట్టుటతో ధరలు మూడురెట్లు నాలుగురెట్లు పెరిగెను. పేదవారు ఆహారపదార్థములు కొనుక్కొనగల స్థితి తప్పిపోయెను. ఈపరిస్థితులు 1876 ఆగష్టునాటికే పొడచూపెను. ఆకలిచిచ్చున కోర్వలేక ప్రజలు మూకలుకట్టుకొని పోయి ఊళ్ళపై బడి ధాన్యపుకొట్టులను దోచుకొనుటకు ప్రారంభించిరి. ఇందుతో ధాన్యపువర్తకులు సరుకును విక్రయించుట విరమించుకొనిరి. క్రొత్త సరుకును తెప్పించుట మానివైచిరి. అగుట పరిస్థితులు మరింత క్లిష్టములయ్యెను. గవర్నమెంటు స్వయముగ ధాన్యపుదిగుమతికి పూనుకొని వర్తకముచేయుటకు ప్రారంభించువఱకును వర్తకులకు తిరిగి ధైర్యము కలుగలేదు. ఈమూకల దోపిళ్ళకు తోడు కర్నూలు, గుంటూరు జిల్లాలకు నైజామురాజ్యమునుండి లంబాడీదండ్లు ఎత్తివచ్చి దోపిళ్లు ప్రారంభించెను. పోలీసువారికి పనితో ఊపిరి సలుపకుండెను. దొంగలను పట్టుకొనుట శిక్షించుటయేగాక వారిని జయిళ్ళయందుంచి కాపాడుటయు పోలీసువారి ప్రధానకృత్యములయ్యెను. పోలీసు బందోబస్తులేనిదే రోడ్లపై ధాన్యపుబళ్ళు పోవుటకు ఆస్కారము లేకుండెను. ఊరూర గవర్నమెంటువారు దోపిళ్ళ నరికట్టుటకు నెలకు ఐదేసి రూపాయిల జీతముమీద ఘాటితలారీలను నియమించిరి. ఊరూర రాత్రిళ్ళు పోలీసు ఉషారీలకు ఏర్పాటులు చేయబడెను. ఎన్ని చేసినను దోపిళ్ళ అలజడి పూర్తిగ అరికట్టబడలేదు. ఈదోపిళ్ళు, పితూరీలు గోదావరి జిల్లాయందు అతివిస్తారమైయుండెను.

... ... ...

చెన్నపురి పరిసరమునగల పల్లెటూళ్ళయందలి ప్రజలు నవంబరుమాసమున తమ పల్లెలను వీడి గుంపులుగుంపులుగా మదరాసు వచ్చిరి. ఆపట్టణమున మాత్రము అన్నమేది ? కాని డిశంబరులో ప్రభుత్వమువారు క్షామనివారణపు పనులను ప్రారంభించిరి. క్రొత్తగా పట్టణమున మూగినవారి ఆరోగ్యము కాపాడునిమిత్తము ఒక ఆరోగ్యాధికారి క్రొత్తగా ప్రత్యేకముగా తగుసిబ్బందితో నియమింపబడెను. ఆ అధికారి తన తాబేదారుల సాయమున ఇంటింటికిని పోయి పరీక్షించి రోగార్తులకు అవసరమగు సాయముచేయువాడు. ఎంత చేసినను ఆనవంబరు, డిశంబరు మాసములలో మదరాసులో విశేషజననష్టముకలిగెను.

... ... ...

1877 జనవరి మాసమున కొందరు తాసిల్దారులకు కలక్టరుఅధికారములిచ్చి క్రొత్తనూతులు త్రవ్వించుటకు ప్రభుత్వమువారు రైతులకు అడ్వాన్సులిప్పించిరి. ఆరోజులలో నీరు ఆవునేతికంటె ఎక్కువ ప్రియమయ్యెను. గంగపాతాళలోకముదాక పాతెను. సరుకులు త్వరత్వరగ దిగుమతిచేయించుటకు ఉత్తర హిందూదేశమునుండి రైలు ఇంజనులెన్నియో అదనముగ రప్పింపబడెను. కాని ఆ రైలు ఇంజనులను నడుపుటకు వలయు నీళ్ళు దొరుకుట దుస్తరమయ్యెను. ఇంజనులకు వలయు నీళ్ళు సరఫరాచేయుటయే ఒక సమస్యయైయుండెననుచో ఆనాడు ప్రజలు నీటికొఱకు ఎంత తహతహలాడిరో సులభముగ ఊహించుకొనవచ్చును. వర్షములు లేవు సరికదా బళ్లారిజిల్లాలో శీతకాలమున రాత్రిపూట మం

చుఅయినను ఆసంవత్సరమున కురియలేదు. ఆకఱవులో అంతటి వఱపు !

... ... ...

జమీందారులనుండియు, ఇనాముదారుల నుండియు ఆదినములలో శిస్తు దస్తులను వసూలుచేయుట ఇనుమున తైలముతీయుట యయ్యెను. నలుగు జిల్లాలలో సగముపన్నులైన వసూలుకాలేదు. మరినాలుగు జిల్లాలలో మూండువంతులలో ఒకవంతు వసూలగుసరికి చుక్కలు దుల్లెను. మరి మూడు జిల్లాలలో నాలుగువంతులలో ఒకవంతు వసూలగుట అతికష్ట మయ్యెను. కొన్ని జిల్లాలలో కలక్టర్లు బలత్కార ముపయోగించినగాని పన్నులు వసూలు కాలేదు. రాజధాని మొత్తముమీద 12,42,772 రైతులు ఆసంవత్సరమున పన్నులు చెల్లింపలేకపోయిరి. చెంగల్పట్టు, తిరునల్వేలి, గోదావరి, తంజావూరు జిల్లాలయందు పన్ను బకాయిలు హెచ్చుగానుండెను. 83 లక్షల రూపాయిల పన్ను బకాయిపడెను.

... ... ...

వ్యవసాయపు పనులు చాలవఱకు కట్టువడిపోయినవి. బళ్లారి, కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాలలో వ్యవసాయము బొత్తిగా తగ్గిపోయెను. మొదటిరోజులలో కొద్ది తుంపరులుపడి రైతులకు ఆశపుట్టింపకుండిన ఆమాత్రము వ్యవసాయపు పనులయినను సాగకుండునవి. ఆదినములలో ప్రకృతి పూర్తిగా ఇచటి జనులను చెవులుపట్టి ఆడించినది. ఆ సంవత్సరము పత్తిచెట్టు అన్నది ఎక్కడను బయలుదేరలేదు.

... ... ...

తినుటకుగడ్డి, తాగుటకు నీరు లేక ఆయేడు జరిగిన పశునష్టమునకు పరిమితిలేకుండెను. కడపజిల్లాలో 1,10,760 పశువులును, కర్నూలు జిల్లాలో 1,18,907 పశువులును, నెల్లూరు జిల్లాలో 60,873 పశువులును ఆధాతు సంవత్సరమునకు బలిపోయెను. రాజధాని మొత్తముమీద ఆయేట 9,22,626 పశువులు చనిపోయెను. మేపలేక ఎందరోరైతులు తమ పశువులను బహు స్వల్పమూల్యములకు విక్రయించిరి. చాల పశువులు విదేశములకు ఎగుమతి చేయబడెను. రైతులు దుక్కిటెద్దులనైన నిలుపుకొనుటకు వానికి తమ పాకల పాత తాటియాకుల చీకునువైచి మేపువారు.

... ... ...

క్షామపరిస్థితులను గమనించి వివరముగ రిపోర్టుచేయ ఇండియాగవర్నమెంటు బెంగాలు గవర్నరును మదరాసునకు బంపెను. అతడు 1877 జనవరి 14–వ తేదీని కర్నూలువచ్చెను. నాలుగుమాసములు రాజధానియందంతటను పర్యటనముసలిపి అతడు ఏప్రియల్ 24–వ తేదీని మదరాసును వీడెను. మదరాసు గవర్నరుకూడ పలుతావుల పర్యటనము సల్పెను.

... ... ...

ఈలోగా ధాతుతీరి 1877 మార్చి 16–వ తేదీని ఈశ్వరసంవత్సరము ప్రారంభమయ్యెను. ధరవరలు పెరుగుచునేయుండెను. రూపాయికి బియ్యము యువలో పదునారుసేర్లు. ధాతులో పదునొకండుసేర్లు. ఈశ్వరలో ఎనిమిదిసేర్లు మాత్రమే. పండినచోటి ధాన్యము ఎండినచోటికి రైలుమీద రవాణాయగుచుండుటచే ఎండినచోటను పండినచోటను కఱవు ఒక్కమాదిరిగానే యుండెను. హెచ్చుధరలలో వ్యాపారము విస్తరించియుండెను. చేతిపనులవలన, నేతపనివలన జీవించువారి బ్రతుకు దుర్భరమయ్యెను. ప్రభుత్వమువారి రిలీఫ్ పనులయందు రాజధాని మొత్తముమీద 1877 ఆగష్టునాటికి ఇరువదిలక్షలమంది పని చేయుచుండిరి. ఆకఱవునాటి రిలీఫ్ పనులలో

బక్కింగుహ్యాంకాలువ యొకటి.

... ... ...

ఈశ్వరసంవత్సరమున ప్రభుత్వమువారు ఉదకమండలమునకు వేసవియాత్ర పోలేదు. మదరాసునందే యుండిపోయిరి. మే 29-వ తేదీని మదరాసుచుట్టుపట్టుల పెద్దతుపాను కొట్టెను. రెండురోజులలో ఇరువదియొక్క అంగుళముల వర్షము దిమ్మరించెను.

... ... ...

జూనుమాసమున మదరాసునాయకులు క్షామబాధితులకు ధనసహాయముచేయ వివిధ దేశములకు విజ్ఞప్తుల నంపిరి. నవంబరునాటికి చందాలరూపమున ఎనుబదిలక్షలరూపాయిలు పోగుపడెను. ఈమొత్తములో అరువదియేడు లక్షలరూపాయిలు గ్రేట్బ్రిటను, ఆస్ట్రేలియాలనుండి వసూలయ్యెను.

... ... ...

ఈసంవత్సరము రాజధాని మొత్తముమీద 1695 దోపిళ్లు జరిగెను. ఇందు 275 దోపిళ్లు ఒక్క బళ్లారిజిల్లాయందే జరిగెను. నెల్లూరు, కర్నూలు జిల్లాలలో కన్నపుదొంగతనములు మితిమీరెను. రైలుస్టేషను ఆవరణములయందు చోఱబడియు, పోవుచున్న సరుకురైళ్లనాపియు ధాన్యము దోచుకొనుట జరుగుచుండుటచే ధాన్యపురైళ్లు పోలీసుబందోబస్తుతో పోవునవి; స్టేషనుఆవరణములు పోలీసుకాపలాలో నుండునవి.

... ... ...

కఱవుతోబాటు కలరా, మశూచికము మొదలగువ్యాధులు పొడసూపుట మనదేశమున పరిపాటి. 1833-34 సంవత్సరములలో గుంటూరు కఱవుకాలముననను; 1866-67 బళ్లారి, గంజాము, ఒరిస్సా కఱవుకాలముననను కలరా ప్రబలియుండెను. ఈకఱవులో 1875 ఏప్రియల్ (వెనుకటియువప్రారంభము) నుండి కలరారోగ ముండెను. ధాతులో అది పెచ్చురిల్లి ఈశ్వరలో అతిగా ప్రబలెను. 1877 లో కలరావలన రాజధాని మొత్తముమీద 3,57,430 మంది చనిపోయిరి. బళ్లారిజిల్లాలో 16,129 మంది, కడపలో 11,759 మంది ఆ యేడు కలరావలన మరణించిరి. కలరాకు తోడు మశూచికవ్యాధికూడ ప్రబలియుండెను. బళ్లారి, గంజాము, కడప జిల్లాలలో స్ఫోటకము మిక్కిలిహెచ్చుగా నుండెను. వానలులేకపోవుటచే మలేరియాజ్వరపుబాధ మాత్రము కొద్దిగ తగ్గెను. ఏకారణముచేతనైననేమి 1877 లో రాజధాని మొత్తము మీద మరణించినవారిసంఖ్య 15,56,312.

... ... ...

ఈశ్వరలోకూడ తొలకరివానలు కురియలేదు. కురిసిన కొద్దిచోట్లలో అవి చాల ఆలస్యముగ కురిసెను. కాని అక్టోబరు మూడవ వారమున కడవానలు తూలగా పడెను. కొన్నిచోట్ల వరదలు సంభవించెను. ధాతులో వర్షములు పడిన గంజాము, విశాఖపట్టణము, గోదావరి జిల్లాలలో ఈయేడు వానలులేవు. మిగిలినజిల్లాలలో వానలు పడినవి. అయినను అవి సస్యానుకూలములైనవని చెప్పుటకు వీలు లేకపోయెను. అవి అదునుకు కురియలేదు.

... ... ...

అదునుకుగాని ఈవానలతోబాటు పంటలు నాశనముచేయు పురుగులు వచ్చెను. గంజాముజిల్లాలో గొంగళిపురుగులు. ఇతరజిల్లాలయందు మిడుతలు. కృష్ణా, నెల్లూరు, కడప, బళ్లారి, కర్నూలు జిల్లాలలో మిడుతలదండ్లు బయలుదేరి పంటలకు కావించిననష్టమునకు హద్దులేదు. వీనిని నాశనముచేయుటకుగాను ధనము వెచ్చింప కలక్టర్లకు ప్రభుత్వము ప్రత్యేకాధికార మిచ్చెను.

మొదటిమాసములందు భరింపరాని ఎండ వేడిమితో, మే 20-వ తేదీని మదరాసు ప్రాంతమున తుపానుతో, వచ్చిన కొద్దిచోట్లలో ఎగించివచ్చిన తొలకరివానలతో, తూలగా కురిసిన కడవానలతో, రోగములతో, ఆహార పదార్థముల కాటకపుధరలతో ప్రజలను పేల్చుకొని తినిన ఈశ్వరసంవత్సరము కడతేరెను. 1878 ఏప్రియల్ 3-వ తేదీని బహుధాన్యసంవత్సరము ప్రారంభమయ్యెను. బహుధాన్య ప్రజలపాలిటి బహుధాన్యమై కాటకపుధరలను క్రమముగ తగ్గించినది.

... ... ...

అఱువదియేండ్లక్రిందటి యువ, ధాతు, ఈశ్వర సంవత్సరములలో మదరాసుప్రజ లింతకఱవు ననుభవించిరి. ఈసారి ఈసంవత్సరము లెట్లుండునో?

శ్లో॥ ధాత్రీవధాత్రీ లోకానామభయాపి భయప్రదా
ధాత్రబ్దే ధరణీనాథాః పరస్పరజయోత్సుకాః॥

'ధాతృసంవత్సరమున భూమిదాదివలె మేలుకూర్చునదియైనను భయముకల్గించుచుండును. రాజులు పరస్పరజయోత్సుకులుగా నుందురు' అని పంచాంగకర్తలును, 'అల ధాతృవత్సరంబున కలదు మనోభయము ప్రజకు' అని రెట్టమతశాస్త్రమును చెప్పుచున్నవి. పోవుచుపోవుచు యువసంవత్సరము ఈ విషయములు నిజములుకాగలవనియే చాటినది. యువసంక్రాంతి వెళ్ళినప్పటినుండియు ఆంధ్రదేశము అకాలవర్షములతో ఆవస్థపడుచున్నది. ఈ ఋతువుకాని వర్షములతో కలరా, స్ఫోటకము ప్రబలి జనులను వేధించుచున్నవి. గంజాంజిల్లాలో దక్షిణప్రాంతమున నీటికఱవు. జిల్లాబోర్డువారు పదివేలరూపాయిలను ఖర్చుపెట్టి వలయుచోట్ల నూతులుత్రవ్వించుచున్నారు. టెక్కలి తాలూకాలో కొన్ని ఎస్టేట్లలో పేష్కసు, సెస్సులు వసూలుచేయవద్దని రివిన్యూబోర్డువారు ఉత్తరువుచేసిరి. విశాఖపట్టణము జిల్లాలో ఫిబ్రవరిలో అకాలమున వర్షములు అపరిమితముగా కురిసి వరహా, శారదానదులు పొంగి పల్లపునాటిని ముంచినవి, చెఱకుపంట చెడినది. తూర్పుగోదావరిలో జనవరి 17, 18 తేదీలలో కాకినాడలో తుపానువర్షము. ఫిబ్రవరియందును వర్షములే. పశ్చిమగోదావరిలో గాలివానకు అరటితోటలుకూలి, మొదటిపంట మాసూళ్లుచెడి, రెండవపంట సాగుచెడి, టెలిగ్రాఫ్ స్తంభములుపడి కలిగిననష్టము అపారమైనది. కృష్ణాజిల్లాలో ముస్తాబాదాలో ఫిబ్రవరి 7-వ తేదీని మూడురోజులవఱకు కరగని పెద్దపెద్ద వడగండ్లవాన. బెజవాడలోను అట్టిదే వాన. ఈ అకాలవర్షములచే ఆజిల్లాలో జనుము, పెసర, మినుము ఈచేలకు అపారనష్టము. గుంటూరుజిల్లాలో పొగాకుపంటకు విశేషనష్టము. నెల్లూరులో వడగండ్లవానకు వాగులు పొంగినవి. పిడుగుపడి పల్లెపాడులో ఒకడు చనిపోయెను. ఉలవసస్యమునకు పూర్తినష్టము. వర్షకాలమున వర్షములు లేకను, ఋతువుగాని ఋతువులో ఇట్లు అధికవర్షములు కురిసియు పంటలకు విపరీతనష్టము కలుగుట క్షామచిహ్నములే అని ప్రజలు భయపడుచున్నారు. భవిష్యత్కాలమెట్లుండునో?

... ... ...

ఈవ్యాసరచన కాధారములు :—

1. Madras Administration Reports: 1876-77 & 1877-78.
2. A Review of the Madras Famine 1876-78.
3. The Famine Campaign in Southern India by Mr. W. Digby.

**THE SOUTH INDIA CO-OPERATIVE INSURANCE SOCIETY, LTD.,**

**MADRAS.**

# ది సౌత్ ఇండియా కో-ఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీ, లిమిటెడ్.

హెడ్డాఫీసు : మద్రాసు. పోస్టుబాక్సు నెం 182.

(1) సహకారధర్మములమీద స్థాపింపబడినది.

(2) రాజధానిలోని ప్రసిద్ధసహకారనాయకులచే నడపబడు చున్నది.

(3) రు 100 లు మొదలు రు 5000 లు వరకు పాలసీలు జారీ చేయబడును.

(4) పాలసీదారులే వాటాదారులు.

(5) ప్రీమియము రేట్లు చాల తక్కువ.

(6) ప్రీమియములను రాజధానిలోని కోఆపరేటివు బ్యాంకులలో చెల్లింపవచ్చును.

(7) ఆటోమాటిక్ నాన్‌ఫర్‌ఫీచరు సౌకర్యముగలదు.

(8) స్త్రీజీవితభీమా యంగీకరింపబడును.

వివరములకు హెడ్డాఫీసునకుగాని, యీ క్రింది ఆర్గనైజర్లకుగాని ఏజంట్లకుగాని వ్రాసి తెలిసికొనవచ్చును.

గంజాం ... డి. కృష్ణమూర్తిగారు, ఆర్గనైజరు, మిలిటరీలైన్సు, బరంపురం.

విశాఖపట్టణం ... ఏ. వీరరాజుగారు, మానేజరు, విజయనగరం కోఆపరేటివు సెంట్రలు బ్యాంకి, విశాఖపట్టణం బ్రాంచి, విశాఖపట్టణం.

తూర్పుగోదావరి... పాణంగిపల్లి సత్యనారాయణగారు, ఇన్స్పెక్టరు, రామచంద్రపురం.

పశ్చిమగోదావరి... టి. కుటుంబశాస్త్రిగారు, ఆర్గనైజరు, నిడదవోలు.

కృష్ణా ... జి. రాఘవశర్మగారు, ఛీఫ్ ఏజంటు, గుడ్లవల్లేరు.

నెల్లూరు ... ఏ. సుబ్రహ్మణ్యంగారు, ఆర్గనైజరు. 1250. యం. వి. అగ్రహారం, నెల్లూరు.

అనంతపురం ... ఏ. నారాయణప్పగారు, ఛీఫ్ ఏజంటు, అనంతపురం.

బళ్లారి ... యస్. ఆర్. సుబ్రహ్మణ్యముగారు, జిల్లాఆర్గనైజర్, హాస్‌పేట.

# న తి

ర చ యి త :

అ ద్దే ప ల్లి నా గ గో పా ల రా వు.

౧

శ్రీసంపన్మణిభూషణాభరణ, లక్ష్మీనాధ ! పూజ్యాంధ్రధా
త్రీ సామ్రాజ్యరమాధినాయక, యశశ్శ్రీయోంగనా సంస్థితాం
కా! సాంద్రోరుగభీర, శిక్షితపరా ! కళ్యాణభావాభి రా
మా! సాష్టాంగసమస్కృతుల్ గొనుము దేవా! ఆంధ్రవిష్ణుప్రభూ !

౨

నీనాడాంధ్రకులప్రతిష్ఠ గడియించెన్ వన్నె; చెన్నొందె వి
జ్ఞానప్రౌఢిమ, దోఃప్రతాప మెసగెన్, వ్యాపించె నీ దిగ్జయ
ధ్యానంబుల్, ఫలియించె తెల్గుల శకస్వామ్యంబు నీఫేర - వీ
రానీకాగ్రణి, శాతవాహనమణీ! అర్పింతు పుష్పాంజలిన్.

3

భాసురభారతార్థములభంగు లెఱుంగని తెల్గువారికిన్
వ్యాసమునిప్రణీతపరమార్థము తెల్లముసేయు నీ పవి
త్రాశయముల్ ఫలించెను, కృతార్థుడవై తివి - నీయశమ్ము ది
గ్దేశము నిండిపోయెను ; సుధీంద్ర ! జొహారులు రాజరాణ్మణీ!

౪

హరిహరబుక్కరాయపరమార్థము, సాయణసృష్టియైన యా
గురుతరరాజ్యభారమునకుం దగు దీవ మహానుభావ! నీ
తరము మహత్తరంబు ; కవితాసుకళారతి పండె గండపెం
డెరపు బహూకృతిప్రకృతి నిత్యనమస్సులు కృష్ణభూపతీ!

౫

ఇతరాంధ్రక్షితిపాలకోత్తముల నెంతేప్రీతిం గొండాడి, త
త్ప్రీతిభాదోర్బలశేముషీవిజయసౌభాగ్యమ్ము కీర్తించి ; సం
స్తుతిపాత్రంబగు వారిగాథల దిశాస్తోమంబు ప్రాకించి - సం
తతమాంధ్రాక్షరమాలికావితతి కానుకల్ వెట్టి కేల్ మోడ్చెదన్.

# ఆమె ఒక జాతి మనిషి

రచయిత:

ఆకుండి సత్యనారాయణ

[గతసంచికకు తరువాయి]

## 3

నాటిసంఘటన అయినతరువాత విశాలంలో ఏమేనా మార్పు వచ్చిందా అంటే లేదనే చెప్పాలి. అబ్బాయితో అంతఉల్లాసంగా చీట్లాడుతున్న సమయాన హఠాత్తుగా భర్త కంటబడేసరికి ఒక్కసారి ఆమె తనప్రవర్తనకు సిగ్గిలినమాట నిజమే. కాని విశ్వనాథం భావించినట్లు అది ఆక్షణంలోనే తుడుచుకుపోయింది— దానివల్ల ఏంప్రయోజనం?

ప్రతిదినమూ మధ్యాహ్నం రెండున్నర కాగానే భర్త ఆఫీసుకు వెళ్ళిందితడవుగా విశాలం యథాప్రకారమే నూనెసీసా, దువ్వెనా చేతబుచ్చుకుని రాముడమ్మగారింటికి బయల్దేరుతుంది. అబ్బాయి అప్పుడు ముందరింటిచీడీలో ఈజీఛయిర్లో కూర్చుని ఆమెను గుర్తించకుండానే, ఆమెరాకతో తన కేమీ సంబంధంలేనట్లు తదేకధ్యానంతో పుస్తకం చూసుకుంటూ ఉంటాడు. అయినా తనరాక అతనికమితమైన ఆనందం కలుగజేస్తుందనీ, తనకోసమే అతడు నిరీక్షిస్తూ ఉంటాడనీ ఆమె సులువుగానే గ్రహించగలిగేది.

ఆమె నెమ్మదిగావచ్చి వెనకటింటి లోద్వారంలో రాముడమ్మపక్కను అబ్బాయికి బాగా కనబడేటట్టు కూర్చుని, జడల్లుకుని చక్కగా బర్మాముడి చుట్టుకుని దానిపైని అర్ధచంద్రాకృతిగా తనచాతుర్యమంతా వినియోగించి పూలుముడుచుకునేది. ముడిచుట్టుకునేందుకూ, పూలుముడుచుకునేందుకూ రెండుచేతులూ పైకెత్తినప్పుడు బింకమైన ఆమె బుజాలవంపులూ, బలిసిన వక్షోజాలఉబుకూ మరీ స్పష్టంగా గోచరించేవి. అవి ఎక్కడ బయటపడిపోతాయో అనే సంకోచభావం ఆమెకుకూడా అంతగా ఉండేదికాదు. అబ్బాయి వాటివంక చూడకుండా ఎంతమాత్రం ఉండలేక పోయేవాడు— ఎవరుమాత్రం చూడకుండా ఉండగలుగుతారు? అప్పుడప్పుడు వారిసంభాషణకూడా ఏదో వింతగాఉండేది.

ఒకొక్కప్పుడు అబ్బాయి భార్యకు వింత వింత తలపిన్నులూ, పైటపిన్నులూ కొని తెచ్చేవాడు. అవిచూసి 'అబ్బాయి! ఖరీదిస్తాను, నాకుకూడా ఇలాంటివి తెచ్చిపెట్టవూ!' అనేది విశాలం.

'తెచ్చినందుకు ఏమిటి బహుమతీ ఇస్తావు?' అనే వాడబ్బాయి చిరునవ్వుతో.

అలా అనడంలో అతని ఉద్దేశమేమిటో ఆమె వెంటనే గ్రహించగలిగేది. కాని పైకి మాత్రం ఆసంగతి గ్రహించనట్లే 'పోనీలే! తెస్తే ఇంతలో అరిగిపోతావుకాబోలు... తేనక్కర్లేదులే!' అనేది గోముగా.

ఆమరుచటిదినమే వాటిని అతడు తెచ్చి

ఇచ్చేవాడని మన మూహించుకోవచ్చును. ఖరీదుమాటా ? అది బహు స్వల్పం. దాన్ని గురించి ఎవరు తలబెడతారు? అబ్బాయివంటి ఉదారస్వభావుడు బొత్తిగా తలపెట్టడు; అంతకిందకు అత దెప్పుడూ దిగలేడు. ఆసంగతి విశాలానికి తెలీనిదికాదు. అయితే మొట్ట మొదట ఆమె ఏదేనా చెప్పగానే అతడు కొంచెం మురిపించడం, ఆమె అలగడం అదంతా మామూలే, ఉత్త తమాషాకే.

వినూత్నమైన నాగరిక వేషాలను గురించి విశాలానికి పూర్తిగా తెలుసును. తెలీడమే కాదు. ఆమే వాటికి ఆదర్శకురాలని కూడా చెప్పవచ్చును. నాజూకైన రకరకముల జాకట్లు కత్తిరింపులూ, లేసుపనులూ ఎంతో మంది స్త్రీలు ఆమెవద్ద నేర్చుకుంటూ ఉంటారు. ఒక్కొక్కరోజున ఆమె వేషం మరీ వింతగా ఉండేది. ఎంతో కళానైపుణ్యం అందులో గోచరించేది. అలాంటప్పుడు అబ్బాయిచూసి 'విశాలం! మీావదినకుగూడా ఇప్పటి ఫాషన్లు కొద్దిగా మప్పరాదూ!' అనేవాడు.

'నువ్వు మప్పలేవేమిటి?' అనేది విశాలం కెంపుబారిన ముఖంతో.

'మీా ఆడవాళ్ళసంగతులు, మీాఫాషన్లు మాకేం తెలుస్తాయి ?' అనేవాడు అబ్బాయి లోపల తనకు తెలీకపోవడమేమిటి అనే గొప్పతో పొంగిపోతూ.

ఆమాటపైని 'అయ్యో! తెలీసు, పాపం!...ఏమీా తెలీకుండానే అంతలేసి కథలు రాస్తున్నావు!' అనేది విశాలం.

ఆమాటలు ఎవరికైనా హుషారు పుట్టించక మానవు. కాని అబ్బాయి మనసులో మాత్రం హుషారుకు బదులు ఏదో కించను రేకెత్తింపజేసేవి. అందుకు కారణం లేకపోలేదు. ఇంతవరకూ తను ఎంతో గొప్ప కథకుడని తన రచనానైపుణ్యమునందామె ఎంతో విశ్వాసముంచింది, ఆ విశ్వాసమంతా వట్టి భ్రమేనని ఆమె భావించవలసిన సమయం ఎప్పుడైనా రావచ్చునేమోనని అతడు భయపడుతూ ఉంటాడు.

అయితే అబ్బాయి గొప్ప కథకుడని విశాలం' భావించడంలో సత్యం లేకపోలేదు. ఆమె భావించిన కంటె అధికమైన సత్యం అందులోఉంది. అతడు ఎన్నో కథలను ఎంతో మనోహరమైన వాటిని రచించాడు. వివిధ మానవప్రకృతులయొక్క మన స్తత్వాన్ని ఎంతో చక్కగా, యథార్థంగా చిత్రించాడు. అతని భాషలోనూ, పాత్రలలోనూ జాతీయతా, ఆత్మవ్యక్తిత్వం పరిమళిస్తూ ఉంటాయనడం కూడా వాస్తవమే. కాని ఏంలాభం? అతనిరచనలలోని గొప్పతనాన్ని ఇంతవరకూ ఎవ్వరూ గుర్తించలేదు. ఎన్నోసార్లు అతడు ఎంతో ఆశతో ప్రకటనార్థము పంపిన వ్యాసాలు పత్రికాధిపతులనుండి వెంటనే తిరుగుముఖమై వచ్చేయి. ఇంకొకడైతే అక్కడితో కొంచెం బుద్ధి మళ్ళించుకుని తన ప్రయత్నం విరమించుకోవలసిందే. కాని అత డెంత మాత్రం నిరాశచెందలేదు. 'ఎప్పుడోనాడు నేను తప్పక నెగ్గగలను. నారచనలోని గొప్పతనాన్ని గుర్తించేవారు, నాహృదయాన్ని అర్థంచేసుకునే వారు ఈవిశాల ప్రపంచంలో ఎప్పటికైనా, ఏమూలనైనా ఉండకపోరు' అని భవభూతివలె తనకు తనే విశ్వాసం కలిగించుకునే వాడు. పాపం, ఎన్నిసార్లు పరాభవం పొందినా అతని కాఆశమాత్రం ఎప్పటికీ వొదిలేదికాదు.

ఎలాగైతేనేం ? విశాలానికిమాత్రం అతని రచనానైపుణ్యమునందలి విశ్వాసం ఈమత్తూ తగ్గకపోగా దినేదినే అధికమాతూ ఉం

డడం చాలా సంతోషకరమైన విషయం. గొప్ప కథకుడు కావడానికి తగిన లక్షణా లెన్నో అతని రచనల్లో ఆమెకు పొడగడు తూఉండేవి. వివిధపాత్రలయొక్క మనోభా వాలను అతడు వ్యక్తపరుస్తూ ఉంటే తన మనసులోని భావాలనే చెబుతున్నట్లు ఆమె కనిపించేది. పాత్రల హృదయాలలోని రహ స్యాలనూ, వారి ఆలోచనలనూ అతడు బైట పెడుతూ ఉంటే తన హృదయంలోని రహ స్యాలనే, తన ఆలోచనలనే బైటపెడుతు న్నట్లు ఆమెకుతోచి అతని కెలా తెలిశాయా అని అమితమైన ఆశ్చర్యం కలిగేది. అందు చేతనే కాబోలు అతనంటే ఆమెకంత ప్రేమ. ఒక్కక్షణమైనా అతణ్ణి వొదిలి ఉండడమం టే ఆమెకెంతో కష్టంగా ఉండేది.

ఇటువంటి సమయంలో రాముడమ్మ పురిటి కని పుట్టింటికి వెళ్ళవలసివచ్చింది. ఇంక వారికి కావలసిం దేమిటి? గుర్రాలకు పగ్గాలు వదల్చి నట్లయింది. ప్రతిరోజూ మధ్యాహ్నం రెండు న్నరకల్లా భర్త ఆఫీసుకు వెళ్ళగానే విశాలం అబ్బాయిదెగ్గిరికి వస్తుంది. అబ్బాయి ఇంట్లో కూడా ఎవ్వరూలేరు. వారిద్దరే. వారిప్పు డెలా ప్రవర్తించినా చూసేవారు, అడిగే వారు ఎవ్వరూలేరు. మధ్యను మందడిద్వారం కూడా ఉన్నందున వారేమిచేసినా, ఎలా ప్ర వర్తించినా ఎవరికీ తెలీదని వారి నమ్మకం. కాని అలాభావించడం వట్టిభ్రమ. ఇలాంటి సంగతు లెన్నటికీ దాగవు. ఎలాగో బైటపడ తాయి. వారి సంబంధం ఇరుగుపొరుగువారికి, క్రమంగా స్నేహితులకు, బంధువులకు, పరిచ యస్తులకు అందరికీ తెలిసిపోయిందీ. ఎవ్వ రూ చూడలేదు. చూడడాని కవకాశంకూడా లేదు. ఎలా తెలిసింది? ఒక్కొక్కప్పుడు అ చేతనములకు కూడా మాట్లాడగలశక్తి వస్తుంది కాబోలు! గోడలకు చెవులుంటా యంటారు. ఒక్క చెవులేకాదు; నోరుకూడా ఉండవచ్చును—ఆయింటి గోడలే వారి రహ స్యాన్ని బయలుపెట్టి ఉంటాయి. అంతే.

విశ్వనాథం ఆఫీసుకు వెళుతున్నప్పుడు, తిరిగి ఇంటికివస్తున్నప్పుడు అందరూ అతణ్ణి చూపి 'ఇతడే విశాలంభర్త' అని వెనక్కు వెళ్ళి వార్లోవారు నవ్వుకుంటూ ఉంటారు. పాపం, విశ్వనాథానికి ఈసంగతు లేమీ తెలీ వు—అమాయకుడు!

## ౪

విశాలానికీ అబ్బాయికీ మధ్య కాలంగంతు లువేస్తూంది. ప్రతిదినమూ మధ్యాహ్నం రెం డున్నరకల్లా భర్త ఆఫీసుకు వెళ్లింది తడవుగా వీధితలుపు గడియవేసి మందడిద్వారంతన్న వి శాలం అబ్బాయి దగ్గిరికి బయల్దేరుతుంది. అ బ్బాయికూడా ఆవేళకు చక్కగా తయారై ఆమెకోసం ఆతృతతో ఎదురు చూస్తూఉంటా డు. నాలుగయ్యే వరకూ ఇరువురు మధురమైన చూపులతో, సల్లాపాలతో వారి యిచ్ఛవచ్చి నట్లు ఎంతో ఉల్లాసంగా కాలంగడుపుతారు. ఆసమయంలో బాహ్యప్రపంచము ఉన్నదనే జ్ఞానమే వారికి తట్టదు. ఇలాసుమారుమూడు మాసములు ఎంతో హాయిగావెళ్లాయి. ఇం తవరకూ ఒకర్నొకరు కలుసుకోనిదే ఒక్క దినంకూడాగడవలేదు. పైగా రోజుకు రెండు మూడుసార్లు వారుకలుసుకునే సమయాలు కూడా ఎన్నోఉన్నాయియని చెప్పవచ్చును.

కాని దినములు ఎప్పుడూ ఒక్క మాది రిగా సౌఖ్యంగా జరగవు. అలా జరుగుతే ప్రపంచం దుఃఖభూయిష్టమని భావించవలసిన అవసరమే ఉండదు.

ఒకరోజున ఎప్పటివలెనే ఒంటిగంట కల్లా

అబ్బాయి మేలుకుని, ముఖం రుద్దుకుని, క్రాపు సవరించుకుని నీటుగా తయారై విశాలం కోసం ఎదురుచూస్తున్నాడు. గడియారం మెల్లగా రెండు కొట్టింది. మిగతా అరగంటా ఎంతలో గడుస్తుంది ఎంతలో విశాలం వస్తుందని ఆతడు తహతహలాడి పోతున్నాడు. ఎలాగై తేనేం. రెండున్నరఅయింది. వీధితలుపు గడియ వేసివచ్చి ఏక్షణంలో విశాలం వస్తుందోఅని అనుక్షణమూ మండడిద్వారం వంక చూస్తున్నాడు. మూడయింది. కాని ఆ వేళ ఎందుచేతనో ఇంకా విశాలంరాలేదు. ఆమె వచ్చే వేళమించి అరగంటయింది. ఇంకా భర్త ఆఫీసుకు వెళ్ళకుండా ఉంటాడా ? జడల్లుకుందికైనా అంత ఆలస్యంకావడానికి అవకాశం లేదు. ఒక వేళ తలంటుపోసుకుంటున్న దేమో అనుకున్నాడు. మూడుంపావయింది. ఇహను రావచ్చును. చిన్నచప్పుడయేసరికి మండడి ద్వారంతట్టు అదిరిచూస్తున్నాడు. మూడున్నర...నాలుగు. కాలం జరిగిపోతూంది. అయినా విశాలం రాలేదు. ఏమిటిది ? ఎవరో బంధువులు పసుపుకుంకానికో, భోజనానికో పిలుస్తే బాగుండదని వెళ్ళిఉంటుంది. అంతే! ఎంతో తప్పనిసరి అయినపని, ఎంతో ఆటంకము లేకపోతే ఆమెఎన్నటికీ రాకుండా ఉండిపోదు.

ఆనాటికి మరిరాదని నిశ్చయించుకుని అబ్బాయి షికారుకు బయల్దేరాడు. కాని అతనికేమీ తోచలేదు. ఎవరితోమాట్లాడడానికి మనసు పోలేదు. సుమారు ఏడుగంటలవరకూ ఎంతో నిరుత్సాహంగా, ఒంటరిగా ఎక్కడెక్కడికో తిరిగి ఆతన్న హోటలుకు వెళ్ళి రెండు మెతుకులు వేసుకుని ఎనిమిదింటికి ఇల్లుచేరుకున్నాడు.

వీధితలుపు తాళంతీసి లోన అడుగువేస్తూ ఉండగా కాలికేదో పుస్తకం తగిలినట్లయింది. ఏమిటాఅని దానిని చేత్తో అందుకుని ఆత్రుత ప్రేరేపిస్తూ ఉండగా తొందరతొందరగా దీపం వెలిగించి చూశాడు. అతని కళ్ళు గిర్రున తిరిగిపోయాయి. ఛర్రున పైనున్న కవరుచింపి చూశాడు. స్వచ్ఛమైన దంతపు పలకవలె తెల్లగా, నున్నగా మెరిసిపోయే కవరుతో; త్రివర్ణ శారదాచిత్రంతో 'సరస్వతి'. అమితమైన ఆశతోనూ, ఆతృతతోనూ అతని హృదయం తహతహలాడి పోతూంది. చప్పున కవరుతిప్పి విషయసూచిక మొదటినుంచి సఖం వరకూ చూశాడు. అతనిదృష్టి ఆగిపోయింది. అతడు చూస్తున్నది నిజమో కలో అతనికి తెలీలేదు. తొందరగా పేజీలు తిప్పి ఒకదగ్గర ఆపేడు. పెద్దఅచ్చులో, చక్కని సముచితమైన చిత్రములతో తనకథ గోచరించింది. అవ్యక్తమైన ఆనందమూ, ఆశ్చర్యమూ ఒకేసారి అతణ్ణి అలుముకుపోయాయి. కథంతా ఒక్కసారి పేజీలన్నీ తిరగవేసి చూశాడు. మళ్ళీ మొదటినుంచి చివరవరకూ జాగ్రత్తగా చదివేడు. తిరిగి మొదటికివచ్చి శీర్షిక పేరు, తనపేరు దగ్గిరనుంచి మరోసారి చూస్తున్నాడు——అతని జీవితంలో అటువంటి సమయం ఎన్నడూ యెరగడు.

దీపం కొద్దిగా తగ్గించి మంచంపైన పడుకుని ఇంకా దాన్నిగురించే ఆలోచిస్తున్నాడు.

ఆకథ రాయడానికి తనకెంతకాలం తీసుకుంది ? శైలి సరళంగా నడవడానికి, ఇంపుగా వినబడడానికి యెక్కడ ఏపదంవేస్తే సరిగా పొందుతుందో అని ఈపదంకాదని ఆపదమూ ఆపదం కాదని ఈపదమూ మారుస్తూ కథనంతట్నీ చెక్కిన శిల్పంవలె తయారుచేయడానికి తను యెంత చాతుర్యం వినియోగించవలసివచ్చింది ? పాత్రలు కల్పితములవలె కా

కుండా యధార్థంగానూ, స్వాభావికంగానూ గోచరించేటట్టు చేయడానికి తన జీవితంలోని యెన్ని అనుభవాలను, యెన్ని సంఘటనలను స్మృతికి తెచ్చుకుని వాటితో పాత్రల అనుభవాలను సరిచూసుకోవలసి వచ్చింది? యెలా గైతేనేం? తన ప్రయత్నం ఇంతకాలానికి సఫలమైంది. ఇప్పటికైనా సరస్వతిపత్రికవారు తనశక్తిని గుర్తించగలగడం సంతోషకరమైన విషయం.

ఇంతవరకూ ఊర్లోని పండితులూ, వ్యాసరచయితలూ, కవులూ, కథకులూ ఎవ్వరూ తనశక్తిని గుర్తించలేదు. తనని సామాన్యునిగా భావించి తనని చూసినప్పుడల్లా తృణీకారభావంతో ఎంతో నిర్లక్ష్యంగా తరలి పోయేవారు. తనుకూడా వారితో సమానంగా తలెత్తుకుని తిరగలేక పోయేవాడు. అవును; ఎలా తిరుగుతాడు? ఇంతవరకూ తనది ఒక్క వ్యాసమైనా ఎందులోనూ ప్రకటింపబడలేదు. ప్రతిమాసపత్రికలోనూ, పక్షపత్రికలోనూ అడుగునా, పైనాకూడా వారి వ్యాసములూ, పేర్లూ అచ్చు పడుతున్నాయి. కాని ఇప్పుడు తన సమయంవచ్చింది. తనసంగతి ఇప్పుడు వారికి వ్యక్త మవుతుంది. ఇలాగున ఆలోచనల మీద ఆలోచనలు అతని తలలో తిరిగి పోతున్నాయి... తూరుపు తెల్లవారింది. కాని అంతు లేని ఆనందపారవశ్యంలో ఆరాత్రి ఎలాగడిచి పోయిందో అతనికి తెలీలేదు. విశాలంరాలేని వెలితికూడా అతని కప్పుడు తట్టలేదు.

దీపపుకాంతి సన్నగిల్లి గదిలోనికి వెలుగు వచ్చేసరికి అతడు గడియారంవైపుచూశాడు. అయిదయింది. వెంటనే సరస్వతిని సూట్కేసులో భద్రపరచి దంతధావన వగైరాలు ముగించిస్నానం చేశాడు. తరువాత చక్కగా క్రాపు దిద్దుకుని సన్నని కద్దరుపంచా, లాల్చీ ధరించాడు. అన్నిటి కంటె విశేషమైంది ఆనాడు అతడు తనసున్నితమైన 'సెల్యులోయిడు' కట్టుతోనున్న అతివిలువైన కళ్లద్దాలను ధరించు కోవడమే.

అతని కళ్లద్దాలకు ఒక విధమైన వ్యక్తిత్వం ఉందని చెప్పవచ్చును. వాటిని అతడు యెంతో అరుదుగా తగిన సమయములలో తప్ప యెప్పుడూ ధరించడు. వాటిని ధరించినప్పుడు కవికుమారునికి, కళోపాసకునికి చెందిన ఒక విధమైన దీప్తి అతనిముఖంలో తాండవిస్తుంది. అతని తల హఠాత్తుగా కుర్రతరహాగా కాకుండా యెంతో విలువైన దానివలె గోచరిస్తుంది. వాటిని ధరించి నప్పుడు నిత్యమూ అతనితో అతిచనువుగా మెలగుతున్న అతని స్నేహితులుకూడా అతణ్ణి యెంతోగౌరవభావంతో చూడకుండా ఉండలేరు. అతనివేష మంతా పూర్తి అయిన పిమ్మట ఠీవిగా నడుచుకుంటూ కాఫీ తీసుకుందికని ఫలహారపుశాలవైపు బయల్దేరాడు. అక్కడ ఫలహారం కాఫీతీసుకున్న పిమ్మట ఒక సారి పఠనమందిరానికి వెళ్లనలెననే అభిలాష కలిగి అటువైపు మళ్లేడు.

ఆనాడు ఆదివారం; ఆఫీసులకూ, కళాశాలలకూ శలవు అయినందునా, రావలసిన కొత్త పత్రికలన్నీ అప్పటికే వచ్చిఉన్నందునా ఉద్యోగస్తులూ, ఉపాధ్యాయులూ, విద్యార్థికులూ, వ్యాసరచయితలూ, కవులూ, కథకులూ అందరూ గుండ్రని విశాలమైన టేబిలు చుట్టూ కూర్చుని యెవరిమట్టుకు వారే తలోపత్రికాతీసి తిరగ వేస్తున్నారు. అబ్బాయిలోన అడుగుపెట్టేసరికి వ్యాసరచయితలూ, కథకులూ, విద్యార్థికులూ అందరూ నిర్ఘాంతపోయినట్టు అతని వంకచూసి 'రండి, ఇలా

రండి!' అని యెవరి మట్టుకు వారే అతనికి తమప్రక్కను చోటు చూపించారు.

అతని కాశ్చర్యంవేసింది. యేమిటి దీనిఅర్థం? ఇదివరకు తను యెన్నివేలసార్లు ఆపఠన మందిరానికి వెళ్లలేదు? వారందరూ యెప్పుడూ తననిచూస్తునే ఉన్నారు! కాని ఇంతవరకూ యెవ్వరూ, యెన్నడూ తన్నుగురించి తల పెట్టనైనాలేదు. యెన్నోసార్లు వార్లో వారు యేదోవిషయాన్ని గురించి చర్చిస్తున్నప్పుడు తనుకూడా తనఅభిప్రాయాన్ని వెలిబుచ్చబోయేవాడు. కాని తన అభిప్రాయమునందు యెవ్వరూ యెటువంటిగౌరవముంచినట్లు అతనికి గుర్తులేదు. ఇవాళ హఠాత్తుగా యేమిటీ గౌరవం? నిన్నటికీ ఇవాళకీ తనేమి మారిపోయాడా? ఇంతవరకూ తన సంగతి వారికి తెలీలేదు. నిన్నసరస్వతిలో తనకథను చూడగానే తనలోనిగొప్పతనం వారి కర్థమయింది— 'మూఢఃపరఃప్రత్యయనేయబుద్ధిః' అన్న కాళిదాసునిసూక్తి అతని తలపుకు వచ్చింది.

పఠనమందిరపుగుమస్తా హాలుమధ్యను టేబిలుయెదుట కూర్చుని ఇరుపక్కలాకూర్చున్న ఏవ్యాసరచయితలతోనో, ఉద్యోగస్థులతోనో బాతాఖానీ వేస్తూఉండేవాడు. తనకేదైనా పత్రికలనుగూర్చిసభోగట్టా కావలసి వచ్చి అతణ్ణి అడుగుతే తనకు జబాబు చెప్పడానికి అతడెప్పుడూ తొందరపడలేదు. అతని సంభాషణంతా పూర్తయిన పిమ్మట ఏదోజబాబు యెంతో విసుగ్గా, నిర్లక్ష్యంగా చెప్పేవాడు. ఆజబాబు కోసం అయిదు, పది, పదిహేనునిముషాలు తను పక్కను నిలుచున్నసంగతే అతనికి తట్టేదికాదు—ఇప్పుడు తననిచూడగానే పక్కనున్న కుర్చీపైనున్న రెకార్డులుతీసి ఖాళీచేసి కూర్చోమని యెంతో బహుమానం చేశాడు.

అంతవరకూ ఒకమూలకూర్చుని ఏదో ఇంగ్లీషుమాసపత్రికను తిలకిస్తున్న శర్మ అబ్బాయిని చూడగానే అతనిచెంతకు వచ్చి పక్కనున్నకుర్చీలో చతికిలబడి చిరునవ్వుతో 'ఏమండీ! సరస్వతిలో మీకథచూశాను. చాలాబాగుంది. అందులోనూ ఉమతాలూకు స్వభావం చాలా చక్కగా చిత్రించారు. ఇంతవరకూ తెనుగు కథలలో స్త్రీల మానసిక స్థితిని యెవ్వరూ అంతస్వాభావసిద్ధంగా నిరూపించడం నేనెక్కడా చూడలేదు.' అన్నాడు.

ఆమాటలు వినే సరికి అబ్బాయికి అమితమైన ఆశ్చర్యం కలిగింది. ఇంతవరకూ శర్మ నవ్వులపత్రికలలో అతితరుచుగా తనకథలు ప్రచురింపబడుతున్నాయనే గర్వంతో తనవిషయంలో యెంతో అనుచితంగా ప్రవర్తించాడు. తనవంటివారితోటి మాట్లాడడమే అతనికి చిన్నతనమన్నట్లుచూసేవాడు. ఇప్పుడు తనపరిచయంకోసం ప్రాధేయపడుతున్న వానివలె కనబడ్డాడు. తనసమయం వచ్చిందికదా అని తనుకూడా వానివలెనే ప్రవర్తిస్తే?... కాని అబ్బాయికి ఆ ఆలోచన ఏమీనచ్చలేదు. అవును; తనుకూడా వానివలెనే ప్రవర్తిస్తే తనగొప్పతన మేముంది? తనుకూడా వానికి సమానుడే అవుతాడు. అంతచులకనివాడు తనెన్నటికీ కాకూడదు—

అందుచేత

'ఏదో—రాసీశాను. స్త్రీలమనోరహస్యాలను సరిగా గ్రహించడానికి తగినంత అనుభవం నాకులేదు. అప్పుడప్పుడు నాకు కలిగిన అనుభవాలను బట్టి వారిస్వభావంగురించి నేనుపడ్డ అభిప్రాయాన్ని మాత్రమే ఉన్నదున్నట్లు వెల్లడించాను. అది యెంతవరకు వారిస్వభావంతో ఏకీభవిస్తుందో చెప్పలేను.' అన్నాడు నెమ్మదిగా.

—సశేషము.

# ఆతని తోట మొక్కల ఇంద్రజాల పుశాల

[అతడు గింజలులేని గంగరేగుపండ్లు కాపించినాడు; ముండ్లులేని బ్రహ్మజెముడు జాతిని తయారుచేసినాడు; చప్పనిపండ్లనుకాయు చెట్లజాతులను మధురఫలములుకాయు వానిగా మార్చినాడు; నిర్గంధకుసుమములకు శాశ్వతముగ సుగంధము హత్తించినాడు; పుట్టు రంగులు పోకార్చి పూవులకు క్రొత్తరంగు లిచ్చినాడు; తాను కనుగొన్న ఏడు క్రొత్త మొక్కలను ఆత డొకసారి పండ్రెండువందల పౌనులకు విక్రయించినాడు. మొక్కలవిషయమున ఆతడు నిజముగా సాటిమేటిలేని మంత్రగాడు. వనప్రతిష్ఠ సప్తసంతానములలో నొకటిగా పరిగణించు భారతీయులకు ఆసుప్రసిద్ధపాశ్చాత్యవనపాలకునిచరిత్ర పఠనార్హమైనది.]

వనకృషియే ఆతని అధ్యయనము

చరిత్రకు అందిన ప్రపంచవనపాలకులలో అంతటివాడు మఱిలేడు. ఆతని పవిత్రనామము లూథర్ బర్‌బ్యాంక్ - వృక్షములలో, కూరగాయలలో, ఫలములలో ఆతడు క్రొత్తరకముల పెక్కింటిని ఉత్పాదించినాడు. ఇన్ని క్రొత్తరకములను పుట్టించిన వనపాలకుడు మఱియొకడు లేడు. ఆతడు తన ఉద్యానవనమునే తన అధ్యయనముగ నొనర్చికొన్నాడు.

ఆతడు పెక్కువత్సరములకు పూర్వము కాలిఫోర్నియాలో మరణించినాడు. ఏతోటయందు నలుబదివత్సరములు ఎడతెగక పరిశ్రమించినాడో ఆతోటయందే ఆతడు ఖననముచేయబడినాడు.

ఆతడు విదేశయాత్రలు గావింపలేదు. తన తోటయందే సర్వవేళల నివశించువాడు. తన తోటకట్టువ దాటి కాలు అవతలపెట్టి యెఱుగని ఆవనపాలకుని నామముమాత్రము పలుదేశములందలి వేలకొలది ప్రజలకు సుపరిచయమై యుండెను.

ఆతడు మిక్కిలి మంచివాడు, ఎంతయు ప్రేమింపదగినవాడు. డెబ్బదిఏడేండ్లు నిండిననిండు వృద్ధాప్యమునకూడ ఆతని హృదయమున తారుణ్యము తరలాడుచుండెను. ఆతని జీవితమంతయు ఆనందోద్రేకముతో, ఉత్సాహాతిశయముతో ఉద్వేలితమగుచుండెను. ఆతని చింతన సృష్టికి పెడదయైనదికాదు. ఆతని ఆలోచన ఎల్లవేళల నిర్మాణముతో కూడినది. ఆతని జీవితముమూలముగా ప్రపంచము పెక్కుభంగుల భాగ్యవంతమైనది; పలుతెఱగుల సుఖవంతమైనది.

ఇల్లు, తోట—వీనియందు బర్‌బ్యాంకునకు అభిమానముమెండు. భార్యను ఆతడు గాఢముగ ప్రేమించినాడు, తన మేనకోడలు బెట్టీజేన్ అనిన అతనికి అగ్గలమగు అభిమానము. బొనిటాఅను తన పెంపుడుకుక్కయందు అతనికిగల వాత్సల్యము వేలయెఱుగనిది. ఇక ఆతనికి ఆతనితోటయే సర్వస్వమును. పూవులు, బిడ్డలు—అన్నిటికంటె ఎక్కువగ వీనిని ఆతడు ప్రేమించువాడు.

మొక్కలను పెంచి పెద్దవానిని చేయుటలో ముఖ్యమైనది చుట్టుపట్టుల వాతావరణమేనని ఆతడు చేయెత్తి చెప్పువాడు. పెరుగుచున్న ప్రదేశమును, ఉండిన్నన్న వాతావర

ణమును మార్చితిమేని మొక్కకూడ తప్పక మారిపోవును.

శీతలప్రదేశమున పెరుగు దేవదారు వృక్షములకు ఆకులు వానిపై బడు మంచును జార్చివైచుటకు వాడి మొనలుగలవిగా నుండును. ఉష్ణప్రదేశములందు పెరుగు తాటిచెట్టు మొదలగువాని ఆకులు తేమను చాలకాలము నిలవచేసికొనుటకు పెద్దవిగానుండును. ఇట్లే ఇతరవృక్షముల విషయమునను వాని నిర్మాణము అవిపెరుగు ప్రదేశములకు అనువుపడియుండును.

జీవితకాలమంతయు ఆతడు డార్విన్ సిద్ధాంతములకు అంకితుడై యుండెను- తత్త్వవేత్తలలో డార్విన్‌ను శిఖామణిగా ఆత డెన్నువాడు. ప్రపంచమునంతటిని సరియైన పథమున పెట్టినవాడు డార్విన్ అనియే అతని తలంపు- ఆతడు గొప్పవనపాలకుడగుటకు వలసిన బోధనమంతయు డార్విన్ వలననే కలిగినది.

బర్‌బ్యాంకు కనుగొన్న దేమి ? మొక్కల ప్రవర్ధనమున ప్రకృతి పద్ధతులన్నియు మెల్లనివి, చుఱుకుకానివి. మొక్కలప్రవర్ధనము చుఱుకుగా చేయుట ఎట్లో ఆతడు నేర్చినాడు. వృక్షముల ప్రవర్ధనము విషయమున శీఘ్రగతి కొఱకు ఆతడు ఎల్లవేళల అడ్డదారు లన్వేషించువాడు.

ఒకసారి ఆతడు ఇరువదివేల. ౧౦౧ రేగు చెట్లను తొమ్మిది మాసములలో డెలివరు చేయుటకు ఆర్డరు తీసికొన్నాడు. సకాలమున ఆ ఆర్డరు డెలివరు చేసినాడు.

ఆతనిపద్ధతి పెంచి ఎంచుట ; ఎంచి పెంచుట

ఏజాతి చెట్లలోకాని క్రొత్తరకములను తయారుచేయు ఆతనిపద్ధతి ఇట్టిది : మొదట ఆతడు పదివేల కొమ్మలనుగాని గింజలనుగాని నాటును. వాని ప్రవర్ధనము లెస్సగ పరీక్షించును.

ఆ పదివేల మొక్కలలో మిగిలిన వాని కంటె ఏపుగ పెరిగినది తనదృష్టిని పడిన తోడనే దానికి ఆతడు ఒక సన్నని గుడ్డపేలిక కట్టును. ఇట్లే ఆతడు ఆరాశిలో ఏపుగ ఎదిగిన మొక్కలను ఎంచును. ఆపదివేల మొక్కలలో ఏపుగనెదిగి ఆతని వరణమున కందునవి సాధారణముగ ముప్పదింటికి మించియుండవు. ఎంచగా మిగిలిన మొక్కలనన్నిటిని ఆతడు నాశనము చేయును. తాను ఎంచి పెంచిన మొక్కల కొమ్మలనుగాని, గింజలను గాని తిరిగినాటి వానియందుకూడ మంచి వానిని ఎంచి మిగిలినవి త్రుంచివైచును. ఇట్లీతీరు అనుకున్న సంఖ్యకు ప్రశస్తమగు మొక్కలు లభ్యమగువఱకును సాగుచునే యుండును.

ఏపుగా ఎదిగిన మూడు లేక నాలుగు మొక్కలను ఎంచుకొనుట—సాధారణమైనవానిని పెఱికివైచుట—మేలైన మొక్కలనుండియే విత్తులనుగైకొని పెంచుట—ఇది ప్రయోజనకరమును, ఫలకరమును అయిన ఆతని పద్ధతి.

పెంచి ఎంచుట : ఎంచి పెంచుట ! తోటలలోనేగాదు ఈపద్ధతి ఫ్యాక్టరీలయందును, పెద్దపెద్ద దుకాణములయందునుకూడ అనుసరింపదగినది. పనికి జీతగాళ్ళను పెట్టుకొను ప్రతియజమానియు తన పనివాళ్ళలో సమర్థులను ఎంచుకొని వారికి అధికప్రోత్సాహము ఇచ్చుటకు సర్వావేళల సంసిద్ధుడై యుండవలయును.

మొక్కలకు మాఱుటకు శక్తియున్నదని ఆతడు కనుగొనినాడు. మొక్కలన్నియు ఒకే

మాదిరివి కావు. వివిధములగు ప్రదేశములకు వివిధములగు శీతోష్ణస్థితులకు అవి అనువుపడ గలవు. ఇట్లు అనువుపడుట ప్రకృతికే వదలుచో కొంత ఆలస్యము జరుగును. కాని బర్‌బ్యాంకు మొక్కలు ఇట్లు అనువుపడుట చురుకుగా జరుగునట్లు చేయగలిగినాడు.

### క్రొత్తమోస్తరు బటానీ తీగె

మామూలు బటానిగింజలకంటె చిన్నవైనవి, తియ్యనైనవి అగు గింజలను కాయు క్రొత్తమోస్తరు బటానీతీగెలను ఎనిమిదేండ్లలో తయారుచేయుటకు ఆతడొకసారి ఒక ఆర్డరు తీసికొనెను. ఎనిమిదేండ్ల గడువుగల ఆ ఆర్డరును మూడేండ్లలోనే ఆతడు పూర్తి చేయగలిగెను. ఆజాతిబటానీతీగెలు కాయు గింజలే ఇపుడు వాని జనకుడగు బర్‌బ్యాంకు పేరిట 'బర్‌బ్యాంక్ ఎంప్సన్ పీ' అను నామముతో ప్రపంచప్రఖ్యాతినందినవి. డబ్బాలలో నిలవచేయబడి ప్రపంచమునందంతటను ఇపుడు విరివిగ వాడబడుచున్న బటానీగింజలు ఈ జాతివే.

### క్రొత్తమోస్తరు నెక్టారిన్ ఫలము

నెక్టారిన్ అను ఫలమును ఆతడు తన విశేషకృషిచే అమృతమధురముగ నొనర్చినాడు. ఇందుకొఱకు ఆతడు పండ్రెండు సంవత్సరములు—నిండు పుష్కరకాలము—పరిశ్రమించినాడు; పండ్రెండువందల పౌనులను వెచ్చించినాడు. పూర్వపు నెక్టారిన్ ఫలముకంటె బరెబ్యాంక్ కనుగొన్నది పెద్దదిగా, హెచ్చు రసముకలదిగా, ఎక్కువ సువాసన కలదిగా నుండియున్నది.

### క్రొత్తమోస్తరు పూతికవృక్షము

జపానుదేశమునందలి పట్టుపరిశ్రామికుల ప్రత్యేకప్రార్థనముపై ఆతడొక క్రొత్తమాదిరి పూతిక (మల్బరీ) వృక్షమును తయారు చేసినాడు. మామూలు పూతికవృక్షమున కంటె ఈక్రొత్తపూతికవృక్షమున ఆకులు హెచ్చు. దాదాపు రెట్టికి రెట్టియుండును. ఈ పూతికఆకులను తినియేగద పట్టుపురుగులు పెరుగునది. ఇదివఱకు రెండుచెట్లకు కలిపిగాని ఉండనన్ని ఆకులు ఇపుడు ఒకేచెట్టున ఉంటున్నవి. ఇది పట్టుపురుగులను పెంచువారికి ఎంత లాభకరమైనది ?

### గింజలులేని కాశీ రేగుపండ్లు

గింజలు లేని పండ్లనుకాయు క్రొత్తరకపు గంగరేగు చెట్లను ఆతడు ఉత్పత్తిచేసినాడు. ఇట్లు ఉత్పత్తిచేయుటకు ఆతడు గంగరేగు చెట్లతో మొత్తముమీద ఇరువదియైదువేల శోధనలుచేసి చూచినాడు. ఈపరిశోధనల ఫలముగా ఆతడు ముప్పది క్రొత్తరకముల గంగరేగుచెట్లకు ఉత్పాదకుడయ్యెను.

### ముండ్లులేని బ్రహ్మచెముడు

ఆతడు చేసిన కృషులన్నిటియందును కష్టతరమైనది ముండ్లులేని బ్రహ్మచెముడును తయారుచేయుట. బ్రహ్మచెముడు చక్కని పశుగ్రాసము. కాని దానిముండ్లు అది పశుగ్రాసముగా ఉపయోగింపబడుటకు పెద్దయడ్డుగా నుండెను. ముండ్లులేని బ్రహ్మచెముడు జాతిని పుట్టింపగలుగుచో ?... ఆరువందల బ్రహ్మచెముడు జాతులను నాటినాడు. వానినిగూర్చి పదునాఱు సంవత్సరముల దీర్ఘకాలము పరిశోధనలపై పరిశోధనలు గావించినాడు. తుదకు ఆతడు సంకల్పసిద్ధుడైనాడు. ముండ్లులేని బ్రహ్మచెముడును ఉత్పాదించినాడు.

మొక్కలన్నిటిలో బ్రహ్మచెముడు మోటైనది. ఎట్టినేలలలోకాని ఎట్టి ప్రతికూల శీతోష్ణస్థితిలోకాని అది బాగుగ పెరుగును– మొక్కలలో గులాబీని పెంచుట ఎంతకష్ట

మో దీనిని పెంచుట అంతసులభము. ఈ విషయమున గులాబీకి ఇది పూర్తిగా విరుద్ధమైనది. అతిసుకుమారమైన గులాబీని పెంచుటకు అతిజాగ్రత్త వలయు. ఒకగులాబీ కొమ్మను కోసి నేలపై బడవేయుము. అది కొంచెముసేపటిలోనే వాడిపోయి ముడుచుకుపోయి చనిపోవును. కాని బ్రహ్మచెముడు మట్టను ఎచ్చటనైన పడవేయుము. అది చావదు. వ్రేళ్ళను పాతించును. బర్ బ్యాంక్ ఒకసారి బర్ లాప్ తో కప్పబడియున్న బీరువాపై బ్రహ్మచెముడు మట్ట నొకదానిని పడవైచెను. ఆమట్ట బర్ లాప్ గుండా గోడపొడుగునను నేలకు వ్రేళ్లు పారించెను.

స్వాభావసిద్ధముగ రుచిలేని ఫలములకు ఆతడు తన విశేషకృషిచేత క్రొత్తరుచిని కల్గింపగల విధానమును కనుగొన్నాడు. ప్రకృతిసిద్ధముగ వాసనలేని పూవులకు ఆతడు తన తీవ్రపరిశోధనవలన సువాసనకల్గింపగల పద్ధతిని కనుగొన్నాడు. స్వాభావసిద్ధముగ వికారవర్ణములుగల కుసుమములకు ఆకర్షణీయములును, మనోహరములును అయిన క్రొత్తరంగులు హత్తింపగల తీరులను ఆతడు తన అపూర్వశోధనలవలన కనుగొన్నాడు. ఏర్చుట, పెంచుట, తిరిగి ఏర్చుట, తిరిగి పెంచుట మున్నగు కార్యవిధానమువలననే ఆతడు మొక్కల విషయమున ఈ వింతమార్పులను కల్గింపగలిగినాడు. మొక్కలకు అదియొక ప్రత్యేకమగు తరిఫియతు.

ఆతనితోట మొక్కలకు నిజముగ ఇంద్రజాలపుశాల. ఆతోటమీద ఆతనికి మంచివరుమానముండెను. ఒకానొక క్రొత్తరకపు మొక్కలను ఆతడొకసారి పంద్రెండువందల పౌనులకు విక్రయించినాడు- పెద్దపెద్ద కంట్రాక్టుల నెన్నియో తీసికొని దివ్యముగ నిర్వహించినాడు- అగుగాక! ధనార్జనముపై ఆతడెప్పుడును ప్రత్యేకదృష్టిని నిలిపినవాడు కాడు.

మొక్కల పెంపకము విషయమున తాను నూతనముగా కనిపెట్టిన పద్ధతులను పిల్లలను పెంచుటయందును, వారిని తరిఫియతు చేయుటయందును ఉపయోగింప నాతడు తన వృద్ధాప్యమున ఉవ్విళ్ళూరినాడు- మతసంబంధమగు సంకుచితదృష్టిని ఆతడు కక్కసించుకొనువాడు- నేటి పాఠశాలలయందలి విద్య బాలుర మానసికశక్తులను తినివేయునదిగా నున్నదని నిర్ణయించి ఆతడు తీవ్రముగ నిరసించువాడు- ఆతడు మఱియొక పదిసంవత్సరముల కాలము బ్రతికియుండుచో ఒక నూత్న విద్యావిధానమును కనుగొని మానవజాతిలో క్రొత్తతీరు మానవులు తయారగుటకు పునాదులు వైచియుండును- ఈవిషయమున ఆతనికిగల తలంపులను ఇతరులు అందుకొని ఇపుడు పనిచేయుచున్నారు- బర్ బ్యాంకు మొక్కలు ఏర్చబడి, మార్చబడి, పెంచబడునట్లే మానవులుకూడ ఏర్చబడి, మార్చబడి, పెంచబడు కాలము కొలదిలోనే రాగలదు.

బర్ బ్యాంకు తోటఉన్నది అమెరికాయందు- ఆతడుచేసిన మొక్కల, విత్తుల వ్యాపారమంతయు ఇంగ్లండు, ఆస్ట్రేలియా, న్యూజిలాండు, కెనడా దేశములతో-

ప్రపంచమునందలి వనపాలకులలో ఆతడు మీనుమిగిలినవాడు; ఆతనితోట మొక్కల ఇంద్రజాలపుశాల-

వనప్రతిష్ట సప్తసంతానములలో నొకటిగ అనంతకాలమునుండి పరిగణించు భారతీయులకు కూడ ఈ పాశ్చాత్యవనపాలకుడు పూజ్యలింగము కాదగియున్నాడు.

# ప్రత్యక్ష భిక్షుకులు : పరోక్ష భిక్షుకులు

రచయిత :

నందూరి బంగారయ్య, బి. ఏ.

ప్రత్యక్షభిక్షుకులు :

వామనమూర్తి, బుద్ధభగవానుడు, శంకరాచార్యులు, చైతన్యుడు, ఏసుక్రీస్తు మున్నగువారు.

పరోక్షభిక్షుకులు :

అలెగ్జాండరు, హ్యానిబాలు, రాత్సుచైల్డు, లాయడుజార్జి మున్నగువారు.

"ఆభిజాత్యమున వారికి వీరుగాని వీరికి వారుగాని తీసిపోరు.

ఎవరిజోలి వారిది, ఎవరిముష్టి వారిది.

దేనినో యొకదానిని సదా బిచ్చమెత్తనివాఁ డీప్రపంచమున లేడు."

పరోక్షభిక్షుకులను భిక్షుకులనరాదు

"అమ్మాబిచ్చము" అని ముష్టివాడరచు సరికి "దుంగవలెనున్నావు. ముష్టియెత్తుకొన నేల ? ఏదైన పనిచూచుకొరాదా" అని గద్దించి పలుకుచుందుము. ముష్టియెత్తుకొని జీవించుటకంటె నికృష్టతరకర్మము లేదని మనలో నొకయభిప్రాయము ప్రబల్లుచున్నది. ఇది దేశమునకు శుభసూచకమే. కాని రోగములసంఖ్య తగ్గింపవలెనని వైద్యులు ప్రబల యత్నములు చేయుచున్నకొలంది క్రొత్త క్రొత్త రోగములు బయలువెడలుచున్నట్లుగ దేశమున భిక్షాటనమును రూపుమాపవలెనని మన నవనాగరికులు బద్ధకంకణులయినకొలది పరోక్షరూపమున నది పరమాత్మకంటెను సర్వవ్యాపకత్వమును వహించుచున్నది. ప్రత్యక్షముష్టి పరోక్షముష్టియని ముష్టిలో స్వరూపభేదములేకాని యాలోచించి చూడగ మనలో భిక్షకుడు కానివాడెవ్వడు ? ఇంగ్లండు దేశమున భిక్షాటనమును తగ్గించుటకయి కొన్ని శాసనములు బయలుదేరినవి. ప్రత్యక్షముగ ముష్టియెత్తుకొనువారిని పోలీసువారు పట్టుకొందురు. ఈబాధపడలేక యిప్పుడు భిక్షుకలోకనూతనమార్గ మవలంబించుచున్నారట. ఏదో వస్తువును అమ్ముకొను మిష మీద బజారులో కూర్చుండి ఎవ్వరైన ధనికుడు కానరాఁగానే ఆవస్తువుల నమ్మఁజూపుచున్నట్లుగ నటించుచు వారిని సమీపించి ఇటునటు పరికించి పోలీసుభటుడు దూరముగా నున్నాడని నిశ్చయించుకొని "అయ్యా! కడుపు మలమల మాడిపోవుచున్నది. ఇంటివద్ద గంపెడుపిల్లలున్నారు. ఏమైన దానము చేయరా ?" అని చేయిచాచురట ! దూర

మాలోచించినచో నీ భిక్షుకులుకూడ అమాయకులుగను యథార్థవాదులుగను కానవచ్చుచున్నారు. ఒకప్పుడు గాకపోయిన నొకప్పుడయిన నీభిక్షుకులు తాము భిక్షుకులమని యొప్పుకొనుచున్నారు. కాని యింతకంటెను విచిత్రస్వరూపముగల భిక్షుకులు బయలుదేరుచున్నారు. వారిని భిక్షుకులని తత్వవేత్తలు గ్రహించి యూరకుండవలసిన దేగాని కర్మము చాలక యెవ్వరితోనైన నన్నచో మర్యాదనష్టముకు మానహానికి దావాలు క్రిమినల్ కేసులు తప్పవు. అంతవఱకు నెందులకు? అంతటి మహనీయులను - దేశహితైకదక్షులను- భిక్షుకులని పిలచినందులకు మనస్నేహితులే మనలను పిచ్చివారుగా భావింతురు. అందుచే పాఠకమహాశయా! మేమీవ్యాసములో వ్రాయబోవు రహస్యములను గాయత్రీమంత్రోపదేశమునువలె మెల్లగా నీచెవిలో నూదినట్లు భావించుకొని నీపెదవి దాటనీయకుము. లేకపోయినచో నీకును మాకునుగూడ మర్యాద దక్కదు సూక్ష్మదర్శనీ యంత్ర సాహాయ్యమున క్రిములను ప్రదర్శించినట్లు మా వ్యాసముఖమున నీకిప్పుడొక్కసారిగ పరోక్ష భిక్షుకప్రపంచమునంతను ప్రదర్శింతుము. కన్నులనేగాని నోరును విప్పకుము.

యాచనకూడ వీరికొక అలంకారము

కద్దరుదోవతి, కద్దరు అంగరఖా, నెత్తిపై గాంధిటోపి. భుజములనుండి యజ్ఞోపవీతప్రాయముగ కద్దరుసంచి ధరించి వచ్చుచున్న ఆవ్యక్తియెవరు? భిక్షుకచక్రవర్తి- తిలకుస్వరాజ్యనిధికై చందాకు బయలుదేరినాఁడు. ఇంటింటను 'దయచేయండి' అని స్వాగతపత్రములే. నమసా రబాణములే. ఉన్నతాసనసన్మానములే! క్కరైనను "దుంగవలెనున్నావు. పనిచేసికోరాదా?" అని అడుగరే? ఎందుచేత? ఈతడు మహాత్ముడు, దేశబాంధవుడు. "పరహితరతిమతియుతులగు దొరలకు నడుగుటయు తొడవగు పుడమిన్." ఆతడుచేయుచున్న భిక్షాటనము పరోపకారార్థమేకదా! అమాయకప్రపంచము!! తెల్లనివన్నియు పాలు నల్లనివన్నియు నీళ్ళని నమ్మును. కాని మన మీమహాశయు నించుక యనుసరించి తత్వమును తెలిసికొందము. వసూలయిన చందాలలో మొదట విఘ్నేశ్వరపూజ కాఫీహోటలు కర్చు. తరువాతసగము "రామామణి" కుటుంబసంరక్షణనిధికి! ఈ రామామణికి ఒక్కనాథుడని లేడు. అందుచే ననాథగ పరిగణించి యీదేశభక్తుఁడామెను పోషించుటకు పూనుకొన్నాడు. కులమునుబట్టి వేశ్యయేయైనను చేయుచున్న వృత్తినిబట్టి బహుజనానురాగపాత్రురాలు- తప్పులేదు ఏదోయొకవిధముగ ఒక్కచోటనే నిలువయుండక ద్రవ్య మింకొకచోటికి చేరుటకదా మనకుఁ గావలసినది! చందాలు వసూలు చేయుటకు వచ్చు ప్రతివ్యక్తియు ఇట్టివాడయినచో బ్రతుక శక్యముకాదు. వారిలో కూడ శీలవంతులు పుణ్యపురుషులు లేకపోలేదు. కాని "దొంగలున్నారు జాగ్రత్త" అని మాత్రమే మాహెచ్చరింపు! ఇట్లే "కుటుంబమును సంరక్షించుకొనుటకు నాయార్జనము చాలకుండ నున్నది. అందుచేత నేమైన దయచేయుఁడు" అని ప్రత్యక్షముగ చేయిచాపుటకు మారుగ సప్తాహములకని, చలివేంద్రలకని, అన్నదానసమాజములకని, హరిజనోద్ధరణమునకని, ఆయుర్వేదసమ్మేళనములకని, ఆంధ్రగీర్వాణవిద్యాపీఠములకని బయలువెడలుచున్న మహనీయులపై నొక్క కన్నువైచి యుంచిన చాలును. అందు స్వోదరపోషణార్థమై బయలుదేరు భిక్షుకమహా

శయుల సంఖ్య నూటి కెంతయుండునో నీకే
విశదము కాఁగలదు.

### పరోక్షభిక్షుకులలో నాలుగురకములు

"చాతుర్వర్ణ్యంమయాసృష్టం గుణకర్మ
విభాగయోః" అనినట్లు కాంతాభిక్షుకులు
కనకభిక్షుకులు కీర్తిభిక్షుకులు అధికారభిక్షు
కులు అని పరోక్షభిక్షుకులను మనము నాలుగు
తరగతులుగా విభజింపవచ్చును. దేనినో యొ
కదానిని సదా బిచ్చమెత్తనివాఁ డీ ప్రపంచ
మున లేఁడు. ఉన్నను ఆతఁడు ప్రపంచాతీతుఁడని
యు, ప్రపంచమునకు ఆతనికి ఏమియు సంబం
ధము లేదనియు చెప్పవచ్చును. ఈభిక్షుకభావ
మొకప్పుఁడు ప్రకోపించి పైకి విజృంభింప
వచ్చును. ఒక్కప్పుఁడు నిగూఢముగ నణఁగి
యుండవచ్చును. దీనికే ఇంగ్లీషుమాటల నుప
యోగించినచో స్టాటిక్ స్టేట్ అనియు, డైన
మిక్ స్టేట్ అనియు మనము పేర్కొనవలసి
యున్నది. ఏస్థితిలోనైననేమి యిది సదా
మనుజుని యాంతర్యమున పనిచేయుచునే
యుండును.

### ఇప్పుడు ఇచ్చుట ఇకమీఁద ముష్టియెత్తుటకు

తనతోఁటలో నొక కాయో కసరో పండి
నప్పుఁడు రైతు దానిని సబ్ డివిజనల్ ఆఫీసరు
(ఇంజనీయరు)కు పంపుచున్నాఁడు కాని మాల
పల్లిలో మలమలమాడిపోవుచున్న హరిజన
సోదరునికి పంపుట లేదే! ప్రస్తుతము తనకు
సబ్ డివిజనల్ ఆఫీసరుతో నేమియు పనిలేకనే
పోవచ్చును. కాని ముందు దాళువాపంటకు
నీరు కావలయును కాదా! అందుచే యిప్పటి
నుండియు మనభిక్షుకమహాశయుఁ డాతని నా
శ్రయించుచున్నాఁడు. ఇక్కడ నుత్తరకాల
మందైన రూఢమగు ప్రయోజనమున్నది.
మరికొందరు మహాశయులున్నారు. కనుచూ
పుమేరలో వారికి కావలసిన యర్థ మెద్దియు
నుండదు. కాని ముందుపుట్టబోవు వారి ముని
మనుమలకో, ఇనిమనుమలకో—ఎప్పుడైన
నేదైన ప్రయోజనమున కక్కరకు వత్తు
రేమోయని ప్రతిదినము పంచాంగపు బ్రాహ్మ
ణులవలె ఊరిలోనున్న పెద్దలనందఱిని ఒక
సారి దర్శించుచు వచ్చుచుందురు. పెద్దలనగా
అధికారమునుబట్టియు ధనమునుబట్టియు పెద్ద
లే కాని నడవడినిబట్టి కాని ఆధ్యాత్మికస్థితినిబట్టి
కాని కాదు. ఇట్టి భిక్షుకులు సామాన్యప్రజల
యందే కాక అధికారవర్గమునందుకూడ కల
రు. ప్రధానమంత్రిపలుకు చప్పిడి వాక్యము
లలో లోకాతీతమైన హాస్యరసమేదో యున్న
ట్లుగ డిస్ట్రిక్టుబోర్డు ప్రెసిడెంటు కడుపుబ్బ
నవ్వుచున్నాఁడు. ఆవాక్యము లెంత పేలవ
ముగ నున్నవో తెలియని వెఱ్ఱివాఁడగుటచే
నాతఁడు నవ్వుచున్నాఁడా? లేదు. ముందెప్పు
డైన నాపత్సమయమున నాతఁడే స్పెషల్
సర్క్యులర్ అయినను బంపించి అడ్డుపడక
పోవునా అను నాశచే తనలో నిబిడీకృతమై
యున్న భిక్షుకభావము ప్రేరేపింపఁగ తన య
భినయశాస్త్రపాండిత్యమంతయు నాతఁ డిప్పుడు
గానఁబరచుచు నవ్వుచున్నాఁడు. మూఁడేండ్లకు
ముందు రాఁబోవు ఎలెక్షనును గూర్చి సన్నా
హముచేయుచున్న అభ్యర్థి యాదినమునుం
డియు "మీయూరిలో రోడ్లన్నియు బాగు
న్నవా? కంకర బాగుగా వైచినారా? కం
ట్రాక్టులు ఏమైనా యిప్పించమంటావా యే
మిటి" అని ఉన్నదో లేనిదో కొంత పలుకు
బడి నటించుచు ఓటరుమహాశయుఁడు కంటఁ
బడినంతనే కౌఁగిలించుకొని "మామా,
బావా" యని క్రొత్తబాంధవ్యములు, క్రొ
త్తవావులు కల్పించుకొని కుశలప్రశ్న మొన
ర్చుచున్నాఁడు. పైన పేర్కొనిన వన్నియు
భిక్షుకభావము స్టాటిక్ గానున్న సందర్భమున

కుదాహరణములు.

ఎలక్షనులయందంతయు భిక్షుకభావమే

దీనియొక్క డైనామిక్ స్టేట్‌ను చూడవలెనన్నచో రవంత పెట్రోలు కర్చునకు సందేహింపక ఎలెక్షనులు తీవ్రముగా నడచు సందర్భములలో ఓట్లభిక్షాటనమునకై బయలుదేరు అభ్యర్థుల వెనుక మనముకూడ నొక కారునవైచుకొని బయలుదేరవలెను. అప్పుడా మహాశయులిచ్చు నుపన్యాసములలోని గాంభీర్యమును గుర్తింపవలెను. పొగడుకొనినట్లు తన్నుతా పొగడికొనుట, తిట్టినట్లు ఇతరులను తిట్టుట, వంశవృక్షసాహాయ్య మక్కర లేకుండగనే సంబంధబాంధవ్యములను విశదీకరించుట, తాను ముందుచేయగల మహోపకారములను అద్దములో చూపించినట్లు ప్రదర్శించుట—ఇన్ని చమత్కారములనరకు నెందులకు? కోట్లుసేయు నామందహాసము నొక్కసారి పరీక్షింపవలెను. "హెహెహె" యని వెకలినవ్వుకాదు. రాచఠీవితో తనయందు తనకున్న విశ్వాసమునకు గౌరవమునకు ఎక్కడను భంగమురాకుండ "భవతిభిక్షాందేహి" యను భావము విస్పష్టముగాకుండ ఎంత నిగ్రహశక్తితో మందహాసమొనర్చుచున్నాడు? మహాకవుల కవిత్వమువలె నీ మందహాసము ధ్వనిప్రధానము. ఇట్టి మందహాసములవృష్టిలో లోకము నాతడు ముంచివేయుచున్నాడు. ఈరీతిగా గ్రామపంచాయితీ సంఘసభ్యత్వమునకు అభ్యర్థియగువాడు మొదలుకొని అమెరికన్ రిపబ్లిక్కునకు ప్రెసిడెంటు పదవి నాశించు వానివరకు అందరును రాత్రియనక, పవలనక, ఆహారనిద్రాదులను త్యజించి, సిగ్గును లజ్జను సలాముకొట్టి, చంకను జోలివైచుకొని బయలుదేరవలసినదే. స్వతంత్రములుగా పరిగణింపబడు నుద్యోగములయందే ఇంత ఆశ్రయశక్తి ఇంత భిక్షుకభావము ప్రకటింపవలసి వచ్చినపుడు అస్వాతంత్ర్యమునకు భాజనములైన రెవిన్యూ, అబ్కారీ, ఇంజనీరింగు, జూడిషల్ డిపార్టుమెంటులలో ప్రమోషనులను ఆశించువారిస్థితిని వేరే వర్ణింపవలెనా? పైయధికారిని, ఆఅధికారిదారాపుత్రులను, ఏతరములోనైన సరే జీవించియున్న ఆతని బాంధవులను, స్నేహితులను, స్నేహితుల స్నేహితులనుగూడ "శ్రీరామపంచాయతనమును" వలె దేవతార్చనపెట్టెలోనుంచి పూజింపవలసినదే. దీనినిబట్టి యీజన్మమునందో భావిజన్మమునందో ఫలసిద్ధికలిగిన కలుగవచ్చును.

ఒకచోట మునిగి యింకొకచోట తేలు భిక్షుకులు

పైని వివరించిన నాలుగుతరగతుల భిక్షుకులలోను ఏమనుజు డేతరగతికి చెందినవాడు అని నిర్ణయింపవలసివచ్చినపుడు హోమోపతీ వైద్యమునందువలె బాహ్యలక్షణములనుబట్టి నిర్ణయింపవీలులేదు. ఆయుర్వేదమునందువలె నాడియే నిదానసాధనము. పైకి కాషాయవస్త్రములు ధరించిన సన్యాసిహృదయమున కాంతాభిలాషము ప్రకోపించుచుండవచ్చును. "అంతరాత్మ" యని పదేపదే కలవరించు అధికారిచేతిలో లంచపునాడి గడియారములోని పెండ్యులమువలె "టంగుటంగు" మని కొట్టుకొనుచుండవచ్చును. మరియు టార్పెడోలవలె ఈభిక్షుకులు ఒకచోట మునిగి యింకొకచోట తేలుచుందురు. ధనభిక్షుకుడుగా బయలుదేరిన నాటుకోటశెట్టి తుదకు కీర్తిభిక్షాతురుడై యన్నసత్రములు వేయించుటయు జరగుచున్నది. కీర్తిభిక్షుకుడుగా బయలుదేరిన దేశసేవకు డొకప్పుడు స్వచ్ఛందసేవకురాండ్ర సంసర్గమున కాంతాభిక్షుకుడు గాకూడ మారిపోవుచున్నాడు. అధికారభిక్షుకుడుగా బయలుదేరిన బోర్డుప్రెసిడెంటు

అయాచితముగ వచ్చులంచములచే గనక భిక్షుకుఁడుగా నవతారాంతరమును దాల్చుచున్నాఁడు. ఈ యనులోమవిలోమప్రకరణముల నన్నిటిని ప్రకృతినుండి గ్రహింపవలసినదేగాని యిచ్చట విపులీకరించుటకు వీలు పడదు.

### భిక్షుకభావము అంటురోగములకెల్ల అంటురోగము

భిక్షుకభావమను రోగము కలరా, మహామారి, రాజయక్ష్మ, క్షయ ఇత్యాది రోగముల వలెనే ఒకవిధమైన సూక్ష్మక్రిములవలన సంభవించుచున్నదని నవీనశాస్త్రజ్ఞులు కనిపెట్టినారు. ఇది యంటురోగములకెల్ల నంటురోగము. కలరాయున్నగు రోగములలో రోగి సంస్పర్శవలన రోగము వ్యాపించుచున్నది. మశూచికము బాహ్యస్పర్శ మక్కరలేకుండ రోగి పీల్చినగాలి పీల్చినను వ్యాపించుచున్నది. ఈ భిక్షుకభావమో రోగులను గూర్చి విన్నంతమాత్రముననే విన్నవారికెల్ల సోకును. మరియు రోగి మాటాడు మాటలయందు, నవ్వే నవ్వులందు, చూచే చూపునందు అన్నిటియందును సూక్ష్మజీవులు క్రిక్కిరిసి యుండును. జడ్జీగారికి ప్లీడరుగారు చేయు సలాము నొక్కదానిని సంగ్రహించి సూక్ష్మపరీక్షకు (డైసెక్షన్) గడంగినచో "అమ్మా! నాకొక్క కమీషను వేయవలసినది. ఇంటర్‌లొక్యూటరీ పిటీషనులు వచ్చినప్పుడు నన్నొకకంటఁజూడవలసినది. వీలయితే న్యాయాన్యాయములతో నిమిత్తములేకుండా కేసులుకూడా నాపక్షమే చేయవలసినది" అను ప్రార్థనలు ఎన్ని ఆ సలాములో నిమిడియున్నవో భిక్షుకభావమెంతగా నాసలాములో మూర్తీభవించి యున్నదో మనకు విస్పష్టమగును. ఇట్లే ఓటరునుచూచి అభ్యర్థి యొనర్చు మందహాసమును, పరిచితునిచూచి డాక్టరుచేయు కుశలప్రశ్నమును పరీక్షింపవచ్చును.

### పరోక్షభిక్షుకుల సాధనసామగ్రి

నెత్తిపై నామములుపెట్టిన గుమ్మడికాయ చెంబు లేక చంకనుజోలి, చేతిలో తంబురా లేక చితారు, నోట వీరబ్రహ్మముగారి తత్వములు లేక రామదాసు కీర్తనలు—ఇవి ప్రత్యక్షభిక్షుకుని సాధనసామాగ్రి. పరోక్షభిక్షుకుగూడ సాధనసామాగ్రిలేనిదే పని జరుగదు. ఒక్కొక్కచో బాగుగా పెంచిన బవిరిగడ్డ ముపయోగించును. ఇంకొకచో ఫ్రెంచికట్ మీసము లుపయోగించును. కొన్ని తత్వములకు గాంధిటోపి పనిచేయును– మరికొన్నిటికి గ్లాసుకోమల్ పనిచేయును. ఒక్కొక్కరికి భారతము, రామాయణము, ఉపనిషత్తులు మున్నగు ప్రాచీనగ్రంధపాండిత్యమువలన నంజనముపారును. మరికొందరికి షేక్స్పియరు, బెర్నార్డుషా, రవీంద్రనాధ ఠాకూరు మున్నగు నవీనరచయితల గ్రంథపాండిత్యమువలన జోలినిండును. ఏమైనను పరోక్షముష్టిలో నున్న గొప్పరహస్య మేమనగా తనకని యెన్నడును చేయిచాపకూడదు. ఎంతసేపును అనాధశరణాలయమును స్థాపించుచున్నాననియో, ఆర్యధర్మబోధినీ పత్రికను స్థాపించుచున్నాననియో, ప్రాచీనాంధ్రశిల్పకళానైపుణ్యమును పునరుద్ధరించుచున్నాననియో ఏదియో యొక విధముగ లోకమునెత్తిగొట్టి ప్రమాణము చేయవలెను. అప్పుడుగాని యిచ్చినవానిని యీయనివానిని సమానముగా దిట్టుట కధికారములభింపదు. ఇచ్చినవానిని ఇంకను యీయలేదేమని, ఈయని వానిని జాతికి మతమునకు దేశమునకు విరోధియని చెడమడ తిట్టవచ్చును. పైగా వసూలుఅయిన సొమ్ముకు అకౌంటు చెప్పుబాధ్యతను తప్పించుకొనుటకుఁగూడ అదియే తారకమంత్రము.

### పరోక్షభిక్షుకునిజోలికి నిండుటయనునదిలేదు

ప్రత్యక్షభిక్షుకుడు అర్ధణాడబ్బులతోనో అరసోలెడుబియ్యముతోనో సంతోషించి పోవును. మనముచేసిన దానమునకు తగిన ప్రతిఫలముకూడ వీనులవిందుగ నాతడు పాడు రామకీర్తనలవలననో తత్త్వములవలననో లభింపకపోదు. కాని పరోక్షభిక్షుకుని జోలికి నిండుటయనునది లేదు. సప్తద్వీపములు గెలిచిన నరపతి యింకను జయించుట కెనిమిదవ ద్వీపము లేకపోయెనేయని పరితపించుచున్నాడు. జనానాచిట్కాలో వేయిమందికి పది మంది తక్కువవచ్చినారేయని నవాబుగారు వాపోవుచున్నారు. అగాధమైన వారితృష్ణ ఆహుతి దొరకినకొలది విజృంభించుచున్నది. ఓటులేనివానికి తాను ఓటరుగానుండిన బాగుండుననిపించును. ఓటరైనవెనుక మెంబరెంత యదృష్టశాలియోకదాయని గుటకలు మ్రింగుచుండును. మెంబరైనవెనుక ప్రెసిడెంటు పదవి కాకపోయెనేయని నిట్టూర్పు విడుచుచుండును. ప్రెసిడెంటు అయినవాడు "ఈచచ్చు తాలూకాకాకు ప్రెసిడెంటయిననేమి? కాకున్ననేమి? జిల్లాబోర్డు ప్రెసిడెంటయినవానిది నిజముగా నదృష్టము" అని యువ్విళ్లూరుచుండును. ఈతీరుగ మెట్లెక్కినకొలఁది భిక్షుకభావముకూడ ఎగబ్రాకుచునే యుండును. ఈ రెండును ఎప్పుడును కలసికొనఁజాలని సమానాంతరసరళరేఖలు.

సరే లోకమున్నంతవఱకు ఆశయున్నది. ఆశయున్నంతవఱకు భిక్షుకభావమున్నది. దానితో బాధపడుటకు ప్రజలు సిద్ధముగానున్నపుడు వారితో మనము తగాదాపడ నక్కరలేదు. ఎవరిజోలి వారిది. ఎవరిముష్టి వారిది.

### మహాదేవుడగు శివుడు ఆదిభిక్షువు

అయితే హాస్యజనకమగు విషయమేమనగా ఒక ముష్టివానిని జూచి యింకొక ముష్టివాడు నవ్వుచున్నాడు. ముఖ్యముగ వైదిక నియోగి కక్షలవలె ప్రత్యక్షభిక్షుకులపై పరోక్షభిక్షుకులు ఎడతెగని నిరసనభావము వహించుచున్నారు. మానవకోటి యంతయు నేకమై విశ్వకల్యాణముకొరకుఁ బ్రయత్నింపవలసిన ఈ దినములలో భిక్షుకప్రపంచమున నిట్టి మనస్పర్ధలుండుటవలన దేశమునకేగాక లోకమునకెల్ల నుపద్రవకరముగ నున్నది. మేమొక అఖిలమానవభిక్షుకమహాసభను సంకల్పించుకొన్నాము. ఈసభలో ప్రత్యక్షభిక్షుకులను పరోక్షభిక్షుకులను సామరస్యము కల్పించుటయే మాప్రధానోద్దేశము. చింకి గావంచాలతోడను, రాగి చెంబులతోడను మాకు సహపంక్తిభోజనమాయని చేతికర్రలవారు, సేలముకండువాలవారు వెనుదీయనక్కరలేదు. ప్రపంచములో అలెగ్జాండరు, హ్యానిబాలు, రాత్సుచైల్డు, లాయడుజార్జి మున్నగు మహనీయులందరు పరోక్షభిక్షుకశాఖకు చెంది దాని కొకయౌన్నత్యమును గల్పించిరనుటకు సందియములేదు. కాని వామనమూర్తి, బుద్ధభగవానుడు, శంకరాచార్యులు, చైతన్యుడు, ఏసుక్రీస్తు మున్నగు నవతారమూర్తులెల్ల ప్రత్యక్షభిక్షుకులు కారా? హిందూదేశమునందలి దేవతలకెల్ల నగ్రస్థానము వహించిన మహాదేవుఁడగు శివునకు "ఆదిభిక్షువు" అను పౌరుషనామమున్నది కాదా! అందుచే నాభిజాత్యమున వారికి వీరుగాని వీరికి వారుగాని తీసిపోరు. మాయాహ్వానము నిరుదెగలవారును మన్నించి భిక్షుకరిపబ్లిక్కులో శాంతి నెలకొనునట్లనుగ్రహింతురుగాక!

# రైళ్లువచ్చినకొత్తలో

[క్రొత్త వస్తువులను అనుమానదృష్టితో చూచుట మానవ స్వభావము. అనంతర కాలమున ఎంతె ప్రజోపకరమైనదగుగాక ఏదైనను వచ్చిన క్రొత్తలో మానవుని అనుమానమునకు గురికాకుండ నుండదు. 1872-వ సంవత్సరమున మొదటిసారి హిందూదేశమున పోస్టుకార్డుల మూలమున ప్రభుత్వమువారు ప్రజల రహస్యముల నన్నిటిని తెలిసికొన ఉద్దేశించినారను వారును ఉండిరి. ఆనాటి పోస్టుకార్డు సంబంధమైన విడ్డూరములు 'హిందూదేశమున పోస్టుకార్డు చరిత్ర' అను వ్యాసమున (చూడు: 'ఆంధ్రభూమి': సంపుటము 2 : సంచిక 7. భావ : చైత్రము) విస్తరింపబడినవి. ఈవ్యాసమున రైళ్లువచ్చిన క్రొత్తలో ఆంగ్ల దేశమున నడచిన విడ్డూరములు వివరింపబడినవి. ఇది మాపాఠకులకు చమత్కారముగ నుండగలదని నమ్ముచున్నాము.]

ఇప్పటికి సరిగా నూటపదునొకండు సంవత్సరములైనది రైళ్ళను కనుగొన్న జార్జిస్టీఫెన్‌సన్ తన తొలిఇంజనును నడిపి. 1825-వ సంవత్సరము సెప్టెంబరు మాసము 27-వ తేదీని స్టీఫెన్‌సన్ తొలి ఇంజను మొదటి రైలుబండిని లాగినది. ఆరైలుబండికి పంద్రెండు వాగనులుండెను. అందు ఆఱువాగనులు రాతిసిబొగ్గుతో నిండియుండెను. మిగిలిన ఆఱును పిండితో నిండియుండెను. ఈపంద్రెండువాగనులకు తుదిని కప్పుగల మరియొక గాడీయుండెను. అందు ఆ రైలు డైరెక్టరులు కూర్చుండిరి. స్టాక్‌టన్, డార్లింగుటన్‌లకు నడుమగల పబ్లిక్ రైలుబాటపైని తొలిసారి ఆరైలు ప్రయాణముచేసెను.

... ... ...


## గార్డులు బండిటాపుమీద కూర్చుండువారు

ఆరోజులలో రైలుప్రయాణము చిత్రతరము, అపాయకరమును అయిఉండెను. ఈరోజులలోవలె అపుడు గార్డులకు రైళ్ళలో ప్రత్యేకపు బండ్లులేవు. అపుడు ఒక్కొక్కరైలుబండికి ఇద్దరేసి గార్డులు ఉండిరి. వారు బండిటాపుమీద కూర్చుండువారు. వారు ఎర్రని జాకట్లుధరించి యుండువారు. ఇంజను నడుపువాడును, బొగ్గువేయువాడును సిల్కుటోపీలను ధరించియుండుట ఆరోజులలో ఒక ఆచారమైయుండెను.


... ... ...

## పత్రికలు, ప్రజలు, పార్లమెంటు వ్యతిరేకము

ప్రయాణవిషయమున ఆశ్చర్యకరమగు అభివృద్ధిని కల్గించి ప్రజాసౌఖ్యమున కెంతయో తోడుపడిన ఈ రైళ్ళకు తొలుతటిదినములలో ప్రజలు సంతోషపూర్వకమగు స్వాగతముచేసిరని మనము తలంపరాదు. అప్పుడు ప్రజాసంఘమునందును, పార్లమెంటునందును రైళ్ళనుగూర్చి సణుగులు గొణుగులు బహుళముగా వినిపించెను. పెక్కు పత్రికలుకూడ ఈరైళ్ళకు ప్రాతికూల్యము వహించెను. ఆనాటి క్వార్టర్లీ రెవ్యూ ఒకానొకప్రత్యేకవ్యాసమున రైళ్ళను అప



కర్నూలు రైల్వే స్టేషన్.



కర్నూలు : హంద్రీ నది : అక్విడక్టు.

హసించుచు ఇట్లు చెప్పెను: 'నేటి కోచ్ బండ్లు నడుచు వేగమునకు రెట్టింపు వేగముతో ఇంజనులు నడుచుట విపరీతమును, అసంగతమును అయినది. ఇంజనులు గంటకు ఎనిమిదిమైళ్ళకంటె హెచ్చు వేగమున పోరాదని పార్లమెంటువారు నియమము గావింతురని మేము విశ్వసించుచున్నాము.'

... ... ...

## రైలునిర్మాతకు క్రాసుపరీక్ష

ప్రజల ప్రతికూలమగు ప్రచారమునకు, అనవసరమగు ఆందోళనమునకు ఫలముగా రైళ్ళనుగూర్చి విచారణసల్ప పార్లమెంటువారు ఒక సెలక్టుకమిటీని నియమించిరి. ఈకమిటీవారు స్టీఫెన్‌సన్‌కు కబురుపంపి ఆతనిని ప్రశ్నలతో ముంచెత్తిరి. ఆప్రాశ్నకులలో నొకడు ఆతనినిట్లు అడిగెను: 'నీఇంజను గంటకు ఎనిమిది లేక పదిమైళ్ళవేగముతో పరుగెత్తుచున్నదనుకొనుము. అప్పుడు ఒక ఆవు రైలుబాట కడ్డముగ వచ్చుననుకొనుము. అది అపాయకరమైన స్థితిగాదా?'...'అవును తప్పివచ్చిన ఆ ఆవునకది అపాయకరమైనదే.' అని ఆ సుప్రసిద్ధ యంత్ర నిర్మాత బదులు చెప్పెను.

... ... ...

## అప్పటి టిక్కెట్టు ఒకలోహపు బిళ్ళ

ఇప్పటివలె ఆరోజులలో రైలుటిక్కెట్లు అట్టలతో చేయబడునవికావు. అప్పటిటిక్కెట్టు ఒక లోహపుబిళ్ళ. వెళ్ళదలచిన స్టేషనునందేగాక నడుమనున్న అన్నిస్టేషనులయందును అది చూపవలసి యుండెను. నేటిరయిలుపెట్టెలలోగల సౌకర్యము లొక్కటికూడ ఆనాడు లేకుండెను. బండియొక్క ఒక ప్రక్క అంతయు ఎట్టి ఆచ్ఛాదనముకాని లేకుండెను. ఎండ, గాలి, వాన స్వేచ్ఛగ లోన జొఱబడుటకు ఎంతయేని అవకాశముండెను. వట్టి కొయ్యపలకలమీదనే కూర్చుండవలసియుండెను. వెనక జేరపడుటకు ఆబల్లలకు అడ్డుగా ఎట్టికమ్ములుగాని లేకుండెను.

... ... ...

## రైలురాకకు బ్యాండుమేళాలు, చర్చిగంటలు

ఈరయిళ్ళవిషయకములగు ఆనాటికథలు ఇప్పుడు మన కెంతయు విడ్డూరము పుట్టించునవిగా నుండును. 1832-వ సంవత్సరమున లీసెస్టర్, స్వానింగ్‌టన్ రయిలుదారి తెఱువబడినదినము ఆరయిలుదారిపైగల ప్రతిపట్టణమున పబ్లికు సెలవుదినముగా భావింపబడెను. రయిలు నడుచునప్పటి చప్పుడు, ఇంజను కూతధ్వని చాలదోఅనునట్లు ఆనాడు నిరంతరము ఆ పట్టణములందలి చర్చిలలోని గంటలు మ్రోగింపబడుచుండెను. బ్యాండుమేళములు చెలరేగుచుండెను. తుపాకులు, ఫిరంగులు పేల్చబడుచుండెను.

... ... ...

ఈ రయిళ్ళను ప్రభుత్వమువారు అచిరకాలముననే చట్టవిరుద్ధమైనవి, అక్రమమైనవి అని ఎంచి నిషేధింతురని పల్లెటిపట్టులయందలి అప్పటి ప్రజలు నిశ్చయముగ నమ్మిరి.

... ... ...

## రైలుఇంజనును ముసలమ్మ దయ్యమన్నది

లీసెస్టర్‌షైర్‌నందలి ఒక వృద్ధురాలు మొదటిసారి రైలు ఇంజనునుచూచినపుడు భయపడి తాను పరుగెత్తగలిగినంత వేగముతో ఇంటికిపరుగెత్తుకొనిపోయి ఇంటలోనివారితో ఇట్లు చెప్పినది! "నేనీవేళ దెయ్యాన్ని కళ్ళారా చూశాను. దానితల పొగలు గ్రక్కుతూ మండుతోంది. అది పందికంటె ఎక్కువగా రోజుతూంది. ఆదెయ్యాన్నికాని, దాన్నిపోలి ఉన్నదాన్నికాని నాజీవితకాలంలో తిరిగి చూడాలని నేను కోరను."

... ... ...

## 'మామీదకు ఈరైళ్ళను ఏలపంపించెదరు?'

ఒక ముసలియామె ఇట్లన్నది. ఇంక ఒక ముసలియాతడు ఆతొలుతటిరయిళ్ళనుగూర్చి ఏమనెనో చూడుడు: ఆతడు మంచి వ్యవసాయదారుడు; చదువుకున్నవాడు. పార్లమెంటులోని తమ మండల ప్రతినిధియగువానికి ఈరైళ్ళనుగూర్చి ఆత డిట్లు వ్రా

సెను: 'మే మీపల్లెటిపట్టులందు అతిశాంతంగా ఉంటున్నాము. ప్రభుత్వంవారిమీద ఎట్టి తిరుగుబాటున్నూ తలపెట్టము. మేము ఈయవలసిన సర్కారు పన్నులను సజావుగా చెల్లిస్తూ ఉన్నాము. ఇట్టి స్థితిలో నిశ్శబ్దముగాను, కలతలేకుండాను ఉన్న మాపొలాలమధ్యను ఈవిడ్డూరపు బండ్లు నడవడానికి ఎందుకు అనుమతించాలి?''

... ... ...

ఆనాటి పిల్లవాళ్ళకు రైలుఇంజను బూచి

ఆరోజులలో అల్లరిపిల్లలను భయపెట్ట తలచిన తల్లులకుమాత్రము ఈరయిలు ఇంజనులు బాగా ఉపయోగపడునవి. అప్పటి పిల్లలను అప్పటి తల్లులు ఇట్లు భయపెట్టువారు: 'అల్లరిచెయ్యడంమాని బుద్ధిగా ఉండకపోతే మిమ్మల్ని ఆఇంజనులో ఎక్కించి పంపించివేస్తాను.' మఱి ఇప్పటికాలపు తల్లులు తమ తమ అల్లరిపిల్లకాయలను సముదాయించుటలో ఇందుకు పూర్తిగా వ్యతిరేకమైన మాటలు పలుకుదురు. నేటి తల్లి ఇట్లు అనును: ''అల్లరిచెయ్యడం మాని బుద్ధిగా ఉండకపోతే మిమ్మల్ని నాతోకూడా రైలు ఎక్కించి ఊరికి తీసుకుపోను.'' రయిలు అనిన ఆనాటి పిల్లలకు అంతజడుపు, ఈనాటి పిల్లలకు ఇంత మోజు.

... ... ...

రైలుబండిలో నిలబడియుండరాదు

ఆనాటి రయిలుసంబంధములగు నియమములు వింతయైనవి, కఠినమైనవి అయిఉండెను. రయిలుస్టేషనులోనికి ప్రయాణికులను మాత్రము రానిచ్చువారు. ఇతరులు లోనికి రాకూడదు. ఎవరిసామాను వారి దగ్గర ఉంచుకొనుటకు వీలులేదు. నేటి మోటారు బస్సులయందువలె ఆనాడు సామానులు రయిలు పెట్టెలపైన టాపుమీదవేసి అవి పడిపోకుండ తాళ్ళతో గట్టిగా కట్టువారు. మఱియు విచిత్రమైన దేమన రయిలుబండిలోపల ఎవరును నిలబడియుండరాదను నియమము. బండిలో బల్లమీదకాని, లేదా దిగువను కాని ప్రతి ప్రయాణికుడును కూర్చుండియుండవలసినదే. ప్రయాణికులు కూర్చుండియుండిరో లేదో చూచుటకూడ ఆనాటి గార్డులు చేయవలసిన పనులయందొకటియై యుండెను. ఏప్రయాణికుడుగాని రైలుయందు కూర్చుండుటకు నిరాకరించి నిలబడియే ఉండుచో అతనిని ముందుస్టేషనునందు దింపివైచువారు.

... ... ...

రైళ్ళకుకూడ ఆదివారమే

రయిళ్ళయందు ప్రయాణము చేయుటకు పూర్వాచారప్రియులు ఆదియందు సుముఖులై యుండలేదు. కొంతకాలమునకు రయిలుప్రయాణమునకు నెమ్మదిగా అలవడినను ప్రార్థనకు ప్రత్యేకింపబడిన ఆదివారమునాడు రయిలు తాకకూడదు అను నియమము తో కొందరుండిరి. కొంతకాలము రయిళ్లుకూడ ఆదివారములందు ప్రయాణముచేయకుండినవి. ఆరోజులయందు రయిలుమార్గము ప్రక్కలయందు పాదచారులై పోవు ప్రయాణికులు రయిలువారికి కొంతడబ్బు కట్టవలసి యుండునది.

వజ్రాయుధము
కలరారోగనివారిణి
కడుపునొప్పి,
విరేచనములు,
వాంతులు,
సమస్త అజీర్ణములు
పోగొట్టును.
సీసా 1-కి రు. 0-4-0
సమస్త ఆయుర్వేద ఔషధములు మావద్ద దొరకును. కేటలాగు ఉచితము.
మృత్యుంజయ ఫార్మసి
గాంధినగర్, బెజవాడ.

# నీవు యేమాసమున పుట్టితివి?

## చైత్రమాస ఫలము.

బ్రహ్మచర్యరతో నిత్యం వేదాధ్యయనతత్పరః।
గురుదేవద్విజాతీనాంభక్తశ్చైత్రసముద్భవః॥

తా॥ చైత్రమాసమునబుట్టినవాడు బ్రహ్మచర్యము సేయుటయందు దీక్షముగలవాడును యెల్లకాలము వేదాధ్యయనము చేయువాడును గురువులయందును దేవతలయందును బ్రాహ్మణులయందును భక్తిగలవాడునై యుండును.

## వైశాఖమాస ఫలము.

సర్వలక్షణసంయుక్తో దీర్ఘదర్శీ కళానిధిః।
సాత్త్వికశ్చిరజీవీచ వైశాఖేజాయతే నరః॥

తా॥ వైశాఖమునం బుట్టినమానవుడు సమస్తలక్షణము లమరియుండువాడును బహుదూరాలోచనగలవాడును విద్యల నెఱింగినవాడును సత్త్వగుణము ప్రధానముగ గలవాడును బహుకాలము జీవించువాడునై యుండును.

## జ్యేష్ఠమాస ఫలము.

నిపుణస్సర్వకార్యేషు నిర్మాంసశ్చ పరీక్షకః।
క్రయవిక్రయకృన్నిత్యం భవేజ్జ్యేష్ఠేచ మానవః॥

తా॥ జ్యేష్ఠమాసమునం బుట్టినమానవుడు సమస్తకార్యములయందు సమర్థుండును కండలేని శరీరము గలవాడును పరీక్షకుండును యెల్లకాలము క్రయవిక్రయము చేయువాడునై యుండును.

## ఆషాఢమాస ఫలము.

నిర్ధనో బహుభుక్క్లిష్టో హలకర్మరతస్సదా।
వ్యాధితో మూర్ఖబుద్ధిశ్చ భవేదాషాఢజో నరః॥

తా॥ ఆషాఢమాసమునం బుట్టినమానవుడు ధనము లేనివాడును అధికముగ భుజియించువాడు కష్టముల నుభవించువాడును వ్యవసాయముచేత జీవించువాడును వ్యాధులననుభవించువాడును మూర్ఖబుద్ధిగలవాడునై యుండును.

## శ్రావణమాస ఫలము.

శ్రావణేజాయతే మర్త్యో వేదకర్మవిశారదః।
పుత్రదారధనైర్యుక్తో సర్వలోకైః ప్రపూజితః॥

తా॥ శ్రావణమాసమునం బుట్టినమానవుడు వేదోక్తకర్మములు సేయించుటయందు సమర్థుడును పుత్రులతోను కళత్రములతోను ధనములతోను గూడినవాడును యెల్లజనులచే బూజింపంబడినవాడును నగును.

## భాద్రపదమాస ఫలము.

భోగీదాతా కృశో దీర్ఘో గౌరః కామీ బహుస్త్రీకః। పుత్రవాన్ధనవాన్ శ్రీమాన్నరో భాద్రపదే భవేత్॥

తా॥ భాద్రపదమాసమున నుత్పన్నుడగు మానవుడు భోగముగలవాడును దానముచేయువాడును చిక్కినశరీరముగలవాడును పొడుగైనవాడును తెల్లని శరీరముగలవాడును కామముగలవాడును అనేకులగు స్త్రీలుగలవాడును పుత్రవంతుడును ధనవంతుడును శ్రీమంతుడునై యుండును.

## ఆశ్వయుజమాస ఫలము.

ఆశ్వినేచనరోజాతో విద్వాన్స్యాత్ప్రియో భవేత్। బహుభృత్యస్త్రీసమాయుక్తో బహ్వపత్యోల్పజీవితః॥

తా॥ ఆశ్వయుజ మాసమునబుట్టిన మానవుడు విద్వాంసుడును రాజప్రియుడును విశేష భటులుగలవాడును భార్యాసమేతుడును విశేషపుత్రులుగలవాడును జీవనముగలవాడునై ఉండును.

కార్తికమాస ఫలము.

వాచాలోవక్రబుద్ధిశ్చకుంచితాగ్రకచోఽలసః । కార్తికేజాయతేనిత్యంబ్రహ్మచర్యరతోభవేత్ ॥

తా॥ కార్తికమాసమున బుట్టినవాడు విశేషముగ మాటలాడువాడును వంకరబుద్ధిగలవాడును వంకరలగు కొన వెంట్రుకలుగలవాడును సోమరితనము గలవాడును యెల్ల కాలము బ్రహ్మచర్యము సేయుటయం దిష్టముగలవాడునై ఉండును.

మార్గశీర్ష మాస ఫలము.

తీర్థయాత్రారతోనిత్యం మంత్రదీక్షాపరాయణః । మార్గశీర్షేభవేన్మర్త్యఃసదా శాస్త్రవిశారదః ॥

తా॥ మార్గశీర్ష మాసంబున బుట్టినవాడు యెల్లకాలము తీర్థయాత్రలయం దిష్టముగలవాడును మంత్రానుష్ఠానమున కంగీకరించి దీక్షలయందు నిరతుడును యెల్ల కాలము శాస్త్రవిచారము గలవాడునయి ఉండును.

పుష్యమాస ఫలము.

పౌషమాసేసముత్పన్నో నరోదుఃఖపరోభవేత్ । సర్వస్వరహితోగుప్తఃపాపమార్గరతఃఖలః ॥

తా॥ పుష్యమాసమునం బుట్టిన నరుడు దుఃఖము లనుభవించువాడును యేవిధమగు సంపదలేనివాడును గోప్యముగ బ్రవర్తించువాడును పాపపుత్రోవం బ్రవర్తించుటయం దిష్టముగలవాడును దుష్టుడునై ఉండును.

మాఘమాస ఫలము.

యోగీశ్వర స్తపోనిష్ఠో వేదవేదాంగపారగః। శాంతో దయాన్వితోదక్షో నరోమాఘేప్రజాయతే ॥

తా॥ మాఘమాసమునం బుట్టినవాడు యోగీశ్వరుడును తపస్సుచేయువాడును వేదాంగములను కడముట్ట నెఱింగినవాడును శాంతిగలవాడును దయారసముగలవాడును సమర్థుడునై ఉండును.

ఫాల్గునమాస ఫలము.

సుకుమారస్సదాభోగీకామినీవల్లభస్సుఖీ । ఫాల్గునేజాయతేమర్త్యోగజాశ్వనరభూషితః ॥

తా॥ ఫాల్గునమాసమునం బుట్టినమానవుడు సౌకుమార్యముగలవాడును యెల్లకాలము భోగమనుభవించువాడును స్త్రీలకు మిగులనిష్టుడును సుఖము లనుభవించువాడును యేనుగులు గుఱ్ఱములు కాలు బలములు వీటిచే మిగుల నున్నతి జెందినవాడును నగును.

[ఈ పంక్తులు జ్యోతిషికసిద్ధాంతియు, ప్రాచీనుడును అగు యవనాచార్యులచే రచియింపబడిన 'యవనజాతకము' నుండి యుద్ధరింపబడినవి. ఇచట ఏమాసమున పుట్టిన ఏయేఫలములుగలవో వివరింపబడినట్లే ఈ గ్రంథమున ఇంకను సంవత్సర, అయన, ఋతు, లగ్న, ద్వాదశభావస్థితగ్రహ, దిన, రాత్రి, పక్ష, తిథి, వార, నక్షత్ర, నక్షత్రపాద, యోని, గణ, యోగ, కరణ, రాశి, గ్రహభావ ఫలములు వివరింపబడినవి. శ్లోకములకు ఆంధ్రతాత్పర్యము. జాతకఫలాదులు తెలిసికొనుట కుపయుక్తమైనది. డెమ్మీసైజున నూరు పుటలుగల ఈ గ్రంథము వెల 0-8-0 మాత్రమే. దొరకుచోటు : పిడుగు వెంకటకృష్ణారావు పంతులు, 2/40 పెద్దునాయునివీథి, మదరాసు.]

# ఇట్టిదంపతులు ఇప్పుడు ఉన్నారా?

[ఈ వ్యాసమున ప్రస్తరింపబడిన నలుగురుపాశ్చాత్యదంపతుల వృత్తాంతములలో దంపతీభావము అగ్గలముగ తరళించుచున్నది. పవిత్రదాంపత్యము అరుదని మనము భావించు పాశ్చాత్యదేశములకు చెందిన ఈదంపతులవృత్తాంతములు మనసారస్వతమునందలి ప్రమద్వరకొఱకు వాపోయిన రురునికథతో, మదాలసకొఱకు దురపిల్లిన కువలయాశ్వుని వృత్తాంతముతో, పురుషానుమరణపుణ్యోత్తరలగు అనేకభారతరమణీమణుల చరిత్రలతో, వికృతాకారయగు భార్యను విడనాడనొల్లని ఉత్తమమన్వంతరకాలమునాటి బ్రాహ్మణునికథతో జతపడుచున్నవి. అయితే ఈవృత్తాంతములు పూర్వపుతరమునకు చెందినవి: కావున విడాకులు, ట్రయల్ పెళ్ళిళ్ళు, కంపానియనేట్ మ్యారేజెస్ ప్రబలియున్న ఈదినములయందు పాశ్చాత్యదేశములందు ఇట్టిదంపతులు విస్తరించియుండుటకు అవకాశముండదేమో అని సంశయగ్రస్తులగువారు ఆ విషయమై సమయశాంఖికుడు చారిత్రకప్రబంధవీధులను పూరించి చెప్పవఱకును తమసంశయములు సిద్ధములవరాదు.]

## ౧

ఇల్లాలులేని ఇల్లు వల్లకాడే.

‘క. నీగౌరవంబు నీ యను
రాగము నీమైత్రి నీసరసభావంబున్
నీ గరువతనము నీదయ
నీగుణముల్ మఱవవచ్చునే యెన్నఁటికిన్?

తే. భామినీమణి! నీపొందు లేమిఁజేసి
యలఁతి మజ్జన్మ మిఁక వ్యర్థమనుచుఁదోఁచె
జలజముఖి! నీవు వెడఁబాసి చనుటఁజేసి
యిదిగొ నిన్నియుఁ గొదవలై యిపుడుదోఁచె.’

ఎడ్విన్ బూత్‌నకు పిన్నటనాటనే వివాహమైనది. ఆ వివాహము దివ్యమైనదైనది. ఎడ్విన్‌పై ఆతని లేబ్రాయపుటాలి పలుకుబడి అవధిలేనిదయ్యెను. పాపము, ఆతరుణదంపతులు చిరకాలము ప్రపంచసుఖ మనుభవింపలేదు. నిండుయౌవనమున భార్య మరణించెను. ఎడ్విన్‌నకు మద్యమనిన ప్రాణము. మద్యపానప్రియత్వము ఆతని నిండు జీవితమునే పచ్చముపాడొనరించునేమో యనునట్లుండెను. కాని భార్యమరణముతో నాతడు దుఃఖవివశుడై మద్యము ముట్టకుండువాడు. మద్యముసంగతి తలపున బారినతోడనే మరణించిన భార్యకూడ తలపున బారునది. గోణము కట్టునాటనుండియు అగ్గలమైయుండిన మద్యమునందలి ఆతని మమకారమును మరణించియు ఆతని సతి మరలింపగలిగినది. ఆమె మరణమూలమున నాతడు పొందిన దుఃఖాతిరేకమును ఈ క్రింది ఆతని వాక్యములు కొంతకు కొంత వర్ణింపగలవు. “ఇప్పుడుకూడ ఆమె బ్రతికేయున్నదనుకొనుచు నేను ఒకొ్కక్కప్పుడు ఆమె పేరెత్తి పిలుతును. నాగది తలుపులు తెఱవబడిన అలికిడి ఏమాత్రమైనను ఆమె వచ్చుచున్నదను భావముతో తల ఎత్తి చూతును. వేలయొఱుగని సుఖానందములను అనుభవింపవలయునని మేము ఆశపడిన ఈ మాకుటీరముముంగిటనుండి చరచరమని ఏదైన మోటారుకారు పోయిన ప్రతిసారియు ఆకారులో నా సర్వస్వమును అయిన నాభార్య ప్రణయస్వరూపము కొఱకు

నేను ఒడలెల్ల కన్నులుగా అన్వేషింతును. నాభారమును భగవంతుడొక్కడుమాత్రమే దింపగలడు. ఏకముఖమున భార్య, తల్లి, సోదరి, బిడ్డ, ఉపదేశకర్త్రి, రక్షణదేవత అయి నన్ను మహనీయముగ సేవించిన ఆమె మరణముచే నాకు కలిగిన పెద్దలోటును తీర్పగల వస్తువేదియు ప్రపంచమున మఱియొకటిలేదు. నాకిపుడు ప్రపంచమంతయు గాఢాంధకారబంధురముగా నున్నది. ఎటుబోవుటకు నాకు దిక్కుతోచుటలేదు. ఆమె లేకుండుటచే ఈ గృహము ప్రయాణికులచే పరిత్యజింపబడిన ఓడవలె నున్నది. ఈపాడు ఓడను నడిపించుట ఎట్లో నాకు తెలియకున్నది.'

—Gamaliel Bradford, 'As God made them.'

౨

వికృతరూపమునకూడ ప్రేమించినాడు.

"క. చాలుం జెప్పకు నీ కా
యాలేటికి మేదినీసురాధిప ! యే నాం
డ్రాలిం జేసెదఁ జేకొను
మాలు సుఖార్థంబొ వేదసార్థమొ చెపుమా?"

... ... ...

"తే. కలికి జవ్వనముడివోయి కడుఁగురూప
యై మదీయభామినియుండు నధిప! యట్టి
దైన నయ్యింతి నొక్కయెగ్గాడ దాని
కింపు మిగులంగ వర్తింతు నిది నిజంబు."

యాండ్రూ జాక్సన్ అతిలోకవీరుడు. రెడ్ ఇండియనులను నిర్జించినాడు; స్పెయిన్ దేశపు సేనలను గెలిచినాడు; బ్రిటీష్ సేనలను ఓడించినాడు; న్యూ ఆర్లీన్సు పట్టణమును కాపాడినాడు. భాగ్యవంతమైన ఆ మహాపట్టణమునందలి ప్రజాసంఘమంతయు ఆతనికి పాదాక్రాంతమైయున్నది; ప్రఖ్యాతపురుషు లెందరో అ ధన్యవాదము లర్పింప గుంపులు గుంపుల నెట్టుకొనివచ్చిరి; అతిలోకసౌందర్యవిరాజితలగు సుందరీమణు లెందరో అతనికి కృతజ్ఞతాపూర్వకముగ అభివందనము లర్పింప స్పర్థతో త్రోపులాడుచు త్రోసికొనుచు వచ్చిరి. ఆతని భార్య రాఛెల్. ఆమె ఒకప్పుడు అందాలబరిణెయైన యువతియై నాజూకుగా, నవ్వులబండిగా ఉండినది. కాని ఇపు డామె ప్రాయపుప్రొద్దు క్రైవాలినది. వాపు అనదగిన బలుపుతో ఆమె ఇపుడు వికృతాకారయైయున్నది. భాగ్యవంతమైన ఆ న్యూఆర్లీన్సు రాజధానీ నగరమునకు పేరు ప్రతిష్ఠలుకూర్పగల ఆ దివ్యసుందరులసరసను తానును ఉండుచో తనభర్తకు అవమానము కల్గింపనుగదా అని ఆమె తహతహలాడినది. తహతహలాడియు ఆమె వచ్చినది. ఆమెరాక అచటకూడిన సౌందర్యదర్పితలు, యౌవనగర్వితలుఅగు సుందరయువతులకు ఒక్కుమ్మడిగా సంభ్రమాశ్చర్యములను కల్గించినది. ఆమె ప్రాణములు పొంది నడవనేర్చిన విఱుగుడుమానివిగ్రహమువలె నున్నది. సమ్మానప్రశంసలలో ఆమెభర్త ఇలు వెడలియున్న ఇన్నినాళ్ళను ఆమె పగటిపూటలను విశ్రాంతి యెఱుగని పనులతో ప్రొద్దు గూకించునది; రాత్రిపూటలను వియోగక్లేశములతో వేగించునది. ఇన్నిదినములును ఆమె ఒక్క ఇంటిపనులనేగాక పాలుపితికి కాచి తోడుపెట్టి పెరుగుచిలుకుట మొదలగు పనులన్నియు చేయునది; పైగా తమ ప్రత్తిపొలముల, ధాన్యపుపొలముల పైపరామరికయు ఆమె చేయవలసియుండునది. పశువులశాలపని పెరటిపని కూడ ఆమెయేచేయవలసి యుండునది. కాగా ఆమెకరములు మోటుదేరి కాయలుకాచినవి; ఆమె విగ్రహము వికారరూపమునకు ఈచబోయినది. జాక్సన్ వీరత్వమును వేయినోళ్ళతో కొనియాడుచున్న

సంఘమే ఆతనిభార్య వికృతాకారమును
సహింపలేక పోయినది. అలంకరించుకొని ఆ
కారరేఖను దిద్దుకొనజాలకుండిన రాఘేల్
యొక్క అవజ్ఞత క్షమింపరానిదని న్యూ
ఆర్లీన్సునందలి వన్నెల విసనకర్రలగు వని
తలు భావించిరి. కాని జాక్సన్‌నకు ఇవియేమి
యు పట్టనేలేదు. తనభార్య ఆకారమెట్టిదిగా
నుండెనో ఆతడు గమనింపనేలేదు. శత్రువుల
దాడినుండి తాను రక్షించిన న్యూ ఆర్లీన్సు
పట్టణమున తనకు వీడ్కోలిచ్చు సందర్భమున
గావింపబడిన పెద్ద విందులో ఆమె ఆతని పా
ర్శ్వవర్తినియై యుండెను. న్యూ ఆర్లీన్సు
పట్టణపు భాగ్యము, సౌందర్యము, ఖ్యాతి
రాశియై ఆసమయమున ఆతని పాదముల
చెంత ప్రవహించుచుండెను. అట్టి మహో
త్సవ సమయమున తన ప్రక్కను అట్టి వికృ
తాకారయగు స్త్రీ భార్యయై మెలగుటకు
అత డెట్టిఅనంగీకారమును కాని చూపించ
లేదు. అచ్చట సమావేశమైన మోహినీ స్వ
రూపములలో వీనుమిగిలిన దేనికంటెను సౌం
దర్యమున తనభార్య తీసికట్టుగా నున్నదను
తలంపే ఆతనికి కలుగలేదనుట సునిశ్చయము.
నాట్యక్రీడావసరమున ఆమెనుచూచి పలువురు
అపహసించిరి. అపహసింతురుగాక! తనకేమి?
రాఘేల్‌కూడ హసింపగలదు. తన భర్త
తన్నంత గాఢముగ ప్రేమించునట్లు తానుచేసి
కొనగలిగినది. తన ప్రణయమునుండి తన
భర్త ఎప్పుడును, ఎట్లును చ్యుతుడు కానే
రడు. కాగా వారు నాష్‌విల్లియందలి తమ
గృహమునకు తిరిగివచ్చిరి. నడుమ కుంపటి
పెట్టుకొని చలికాచుకొనుచు, విలాసముగ
ధూమపానము గావించుకొనుచు, కబుర్లు
చెప్పుకొనుచు సుఖానందములతో రోజు ఒక
గడియగా వారు వెళ్ళబుచ్చిరి. ఆమెభర్త ఆ
మెను దేవీస్వరూపమున ఆరాధించెను. ము
ప్పదియైదు సంవత్సరముల నిండాఱుకాలమున
ఆతడు ఆమెను అపూర్వమును, అగాధమును
అగు ప్రణయసముద్రమున తేలియాడించెను.
భర్తవలని అంతటి ప్రేమను చూఱుకొనగల్గు
భాగ్యము ఈ ప్రపంచమున కొలదిమందికే
లభింపగలదు.

—Gerald Johnson, 'Andrew Jackson.'

## ౩

"కలిసిబ్రతికినాము: కలిసి మరణింతము."

"సహచారిణివి గమ్మ సకలకాలమునందు
నిండుఁజందురునిఁ జంద్రికయుఁబోలెఁ
దొలుకాఱుమొగులు విద్యుల్లేఖయును బోలె
ననుగమింపఁగఁబాడి యతివ మగని"

... ... ...

"గీ. తండ్రివంశంబునం దేడుతరములకును
దల్లివంశంబునం దేడుతరములకును
ధవునివంశంబునం దేడుతరములకును
శాశ్వతస్వర్గసౌఖ్య మీఁ జాలు సాధ్వి."

ఇది 1912–వ సంవత్సరమున జరిగిన ము
చ్చట. అంతవఱకు ప్రపంచమున ఏఓడకం
టెను పెద్దదియగు ఓడ నిర్మింపబడెను. దానికి
'టైటానిక్' అని పేరుపెట్టబడెను. తొలిసారి
ప్రయాణమున అది లండన్‌నుండి న్యూయా
ర్కునకు ప్రయాణమయ్యెను. కాని భగవ
ద్విలాస మెట్టిదోకాని ఆపెద్దయోడ మార్గ
మధ్యమున మునిగిపోయెను, మునిగిపోవుటకు
ముందు స్త్రీలను, శిశువులను చిన్నపడవలపై
కెక్కించి పంపివైచి పురుషులందరును ఓడ
తోబాటు సముద్రగర్భమున చొచ్చిరి. చిన్న
పడవపై ఎక్కుటకు నిరాకరించి మునిగిపోవు
చున్న ఓడయందే ఉండ మార్కించిన స్త్రీ
లును అందు కొలదిగానుండిరి. అట్లు ఉన్న

కొద్దిపాటి స్త్రీలలో ఇశాడార్ స్ట్రాస్ సతి యొకతె. అయితే ఆమె ఇతరస్త్రీలవలె రక్షింపబడుటకు నిరాకరించి ఓడతోబాటు మునిగిపోవ నిశ్చయించుకొని అట్లు మునిగి పోవుటకు కారణమేమి ? మునిగిపోవుచున్న ఓడలోనే ఉండిపోవుచున్న తన భర్తను విడువ నొల్లక. చిన్న పడవలను దించి స్త్రీలను శిశువులను వానిలోనికి ఎక్కించు ఆకంగారులో అతడును, ఆమెయు ఎట్టి గజిబిజికాని లేని శాంతచిత్తముతో నుండిరి. వికలచిత్తులైన స్త్రీల వెఱపుడిపి, భయపడిన బిడ్డల బుజ్జగించి స్ట్రాస్ దంపతులు వారిని చిన్నపడవలపయి ఎక్కించువారు. ఈసమయమున అనుక్షణము ఆతడు తన భార్యనుకూడ ఏదైన నొక చిన్నపడవలో తావుచూచుకొన హెచ్చరించుచునే వచ్చుచుండువాడు. ఎంతచెప్పినను ఆమె వినిపించుకొనలేదు. తుదకు ఆతడు పట్టు బలవంతమువిూద ఒకచిన్న పడవలోనికి ఆమెను త్రోసి ఒకచోట అదిమి కూర్చుండబెట్టినాడు. కాని ఆతడు చేయి సడలించిన మరుక్షణమున ఆమె నారిబిగి ఎడలినప్పటి వింటిబద్దవలె చెంగున ఎగసి చిన్నపడవనుండి ఓడపైకి దుమికినది. ఆమెను వారించుటకు అప్పటికే ఒడుపు దప్పిపోయినందులకు విచారించుచున్న భర్త హస్తమును అతికాంక్షతో పట్టుకొని ఆమె దగ్గరకు తీసికొని భర్త అంగస్పర్శచే కలిగిన సంతోషమున పరవశయగుచు ప్రార్థనామృదూక్తులతో జాలిగదుర ఇట్లు పలికినది. "పలువత్సరములనుండి మనము ప్రాణము ప్రాణముగ కలిసి మెలిసి యుంటిమి. ఇపుడు మన మిరువురమును వృద్ధులమైతిమి. నీవు పోవు తావునకు నేనును అనుగమించి వత్తును."

—Newyork Times.

## ౪

"నీతోడున్న ఆసుపత్రియు సుఖధామమే."

"తే. అధికదుఃఖార్తున కౌషధంబు
సురుచిరంబుగ భార్యయ చూవె యెందు
నొనర భార్యాసమేతుఁడై యున్నవాని
కెంతలయ్యును నాపద లెఱుకపడవు.


... ... ...

క. అలసినెడ డస్సినెడ నాఁ
కలి తృష్ణయు నైనయెడలఁ గడుకొని ధరణీ
తలనాథ! పురుషునకు ని
మ్ముల భార్యయపాచుఁ జిత్తమున దుఃఖంబుల్."


ఒకప్పుడు ఆంగ్లమహాసామ్రాజ్యమునకు మంత్రిమాణిక్యమైనవాడు డిజ్రాలీ. ఆతడు తనముప్పదిమూడవఏట తనకంటె వయస్సున పండ్రెండేండ్లు పెద్దదియగు నలుబదియైదేండ్ల వితంతువును-వికాసములేనిదానిని, క్రీడాచాపల్యము కలదానిని వివాహమైనపుడు సంఘము అపహాస్యముచేసెను. అయినను ఆవివాహ మాతనికి సమర్చనీయమగు స్వర్గమును, ఆర్ద్రహృదయతకు అభయస్థానమును అయ్యెను. నిజమునకు ఆవృద్ధవింతతువు- మేరీయానీ-వికాసములేనిదే. కాని అందువలన కలుగగల ప్రతిబంధకమేమి? ఆమెకు సహజమగు వివేకమున్నది, రాజకీయవిషయములందు చక్కని ఉపదేశముల నిచ్చినది, ఎలక్షనులసందర్భమున మగనికి ఎంతయో ఉపకరించినది. క్రీడాచపలములగు ఆమెమాటలు ఆతనికి ఆనందమును గూర్చి శ్రమను పోకార్చునవి. ప్రజ్ఞాధురీణలగు స్త్రీలెందఱో ఆతనికి స్నేహితురాండ్రుగ ఉండినారు. పరిహాసవిజల్పితములగు వారిపలుకులతోడనే ఆతనికి ఆవిషయమున పూర్ణమగు తృప్తి ఉండినది. కాగా తనభార్య ప్రజ్ఞాధురీణయై అబ్బురపాటుకల్గించు పరిహాసవిజల్పితవాక్యములను పలుకకపోయినను అతని కదియొక లోటుగా కన్పించకుండునది. వివేకశూ

నృతత అనిపింపజాలు నిష్కాపట్యముతో, దుస్తులవిషయమున ఏవపుట్టింపజాలు విడ్డూరపు అభిరుచితో ఆమె తన భర్తతోగూడ పోయిన ప్రతిగొప్పయింటను పరిహాసమునకు గుఱియగుచుండెను. మానధనుడు, ఉచితజ్ఞుడు అగు డిజ్రాలీ ఈవ్యతిక్రమములను కనిపెట్టక పోలేదు. అయినను అతడు పల్లెత్తి ఆమెను ఒకసారియైన కఠినాతురకలితములగు మాటల నాడలేదు. చెలిమి, చనువు గల మిత్రు డొకడొకసారి ఆతనితో ఇట్లనెను: "నీభార్య అవివేకసంభాషణము నీకు ఒక్కసారియైనచికాకు కలిగింపకుండుటకు నీవు రూపొందినశాంతిగుణమవు కావలయును." డిజ్రాలి దాని కిట్లు బదులుచెప్పెను: "నేను నీ వనుకొన్నట్లుఆకారముగొన్న శాంతిగుణమును కాను. భర్తలయందు మృగ్యమైయున్న గుణమొకటిమాత్రము నాకడనున్నది. అది ఏదియందువా? కృతజ్ఞత." తనభర్తహృదయమున నిరంతరము ఉపకారస్మరణము జరుగుచుండిన దనువిషయము మేరీయానీకి తెలియును. కావున ఆమె ఆతనిని దేవునివలె పూజించినది; ఇంటివలన, నౌకరులవలన ఆతడు పొందగలుగు ఆనందసుఖములలో ఎట్టికొఱతయుగలుగకుండ నామె జాగ్రత్తపెట్టునది. ఒక్కొక్కప్పుడు డిజ్రాలి పార్లమెంటులో ఉదయము ఐదుగంటల వఱకును రాజకీయచర్చలయందు పాల్గొని వచ్చువాడు. వచ్చుసరికి ఆతనికి గృహమున చక్కనిస్వాగతముకల్గుటకై మేరీయానీ పెందలకడనే లేచునది; ఇల్లంతయు దీపలక్ష్ములతో దీప్తమగునట్లు చేయునది; ఇవతాళించుగాలికి వెచ్చందనమిచ్చుటకు కుంపటిని కణకణనిప్పులతో రాజచెట్టునది. ఒక్కొక్కప్పుడు ఆమెయే ఆతనిరాత్రిభోజనమును సెయింటుస్టీఫెన్సు భవనమునకు గొనిపోయి అతని రాకకొఱకు గంటలకొలది వేచియుండునది. ఒక్కసారి కూడ ఆత డామెఅనురాగమును త్రోసిరాజనలేదు. పార్లమెంటుచర్చలయందు తనకు గలిగిన అపూర్వజయములను పురస్కరించుకొని చేయసంకల్పింపబడిన రాత్రివిందులకు పోవుటనుకూడ నాతడు మానుకొని ఆమె తెచ్చిన భోజనమునే చవులుగొనువాడు. డెబ్బదిఏడేండ్లవృద్ధురాలైన ఆమె నాతడు యువతినివలె ప్రేమించువాడు. ఒకమారు వారిరువురకును ఒక్కసారియే జబ్బుచేసెను. అపుడు ఇరువురును వారియింట వేఱువేఱుగదులయందుండవలసివచ్చెను. ఆవియోగమే వారికి భరింపరానిదయ్యెను. ఒండొరులకు లెక్కలేని ఉత్తరములు వ్రాసికొనుచు వా రానాలుగుదినములు గడిపినారు. డిజ్రాలీ ఒకసారి ఇట్టిఉత్తరములలో నొకదానియం దిట్లు వ్రాసినాడు: "పరుండియుండి వ్రాయుచున్నకారణమున ఈఉత్తరము పెన్సిలుతో వ్రాయుచున్నాను. మన్నింపుము. నీవు ఇంతక్రితముపంపినఉత్తరము చాలఆకర్షణీయముగనుండి ఆనందమిచ్చుచున్నది. ఇంతటి ఆనందకరమైన ఉత్తరమును నే నింతవఱకు ఎప్పుడును అందుకొనియుండలేదు. మనఉభయులరుగ్ణతతో మనఈ గ్రాస్ వెనర్ గేట్ గృహము ఇపుడొకఆసుపత్రియైనది. ఇతరులతోగూడియుండు రాజభవనముకంటె నీతోగూడియుండు ఆసుపత్రియే నాకు హెచ్చుసుఖకరమైనది. —ఇట్లు, నీ డిజ్రాలీ." ఆమెమరణానంతరము ఆమెబద్ధానురాగమును భర్తీచేయగల వస్తు వేదియు ఆతనికి లభింపకపోయినది. మిగిలిన జీవితకాలమంతయు నాతడు తనలేఖాపత్రముల నాలుగుకొసలను విచారసూచకముగ నల్లటిబోర్డరుతో నల్లపఱచి యుంచువాడు.

Andre Maurois 'Disraeli.'



కర్నూలు జిల్లా సుంకేసుల: తుంగభద్ర ఆనకట్ట



కర్నూలు : తుంగభద్ర రైలువంతెన

# గర్భస్రావపు హక్కు

['గర్భస్రావముచేసికొను హక్కుండవలెను' అను శీర్షికతో 'ఆంధ్రభూమి' ఫిబ్రవరి సంచికలో శ్రీమతి బి. వెంకటలక్ష్మమ్మగారు వ్రాసిన వ్యాసమును చర్చించుచు మా కార్యాలయమునకు వచ్చిన అభిప్రాయములలో నాలుగింటిని ఇచట ప్రచురించుచున్నాము. పైమాసమున మరికొన్ని ప్రచురింపగలము.]

౧

"వితంతువులచేతను; తదితర అనారోగ్యులు, అర్థహీనలునగు స్త్రీలచేతను మోటగు నాటువైద్యసహాయముతో చేసుకొనబడు గర్భస్రావములు నిపుణులగు వైద్యులసహాయమున చేయబడవలెననియు, అట్టివి శాసనసమ్మతము కావలెననియు వ్యాసముయొక్క ముఖ్యసిద్ధాంతం. ఏవిధమున గావింపబడినను గర్భస్రావములు భ్రూణహత్యాదోషము నాపాదించు ననుమాట యటుంచి స్త్రీజాతి యారోగ్యమును సమూలముగా నాశన మొనర్చుననుట కెట్టి సందేహమును లేదు. అట్టి అవివేకకార్యములు అవినీతికరములు, అశాస్త్రీయములు అనుమాట యటుంచి మనజీవితప్రవృత్తికారకమగు ప్రకృతిమార్గములకు కేవలము వ్యతిరిక్తమనుట విస్మరింపరాని విషయము. వృక్షలోకమున గూడ పక్వఫలము తనంతనే తరువునుండి పతితమగును. అట్టి పతనము చెట్టునకుగాని పండునకుగాని రవంతయు బాధకముగాదు. కాని అపరిపక్వఫలము నవసరపడి త్రుంచిన చెట్టునుండి జీవసారము చాల సేపటివరకు వాడిపోవుచునే యుండును. కాయకూడ నిరుపయోగమగును. అటులనే గర్భస్రావములుగూడ కలుగబోవు సజీవవ్యక్తికి ఇహలోకప్రాప్తి లేకుండ జేయుటయేగాక తల్లి ఆరోగ్యభాగ్యమును కూడ కూకటివేళ్ళతో కూల్చివేయుననుట కేసందేహమును లేదు. కాన సంఘసౌభాగ్యమునకుగాను బలవంతగర్భస్రావములు సంఘమునుండి మాయము గావలెననుట నిర్వివాదాంశము. అట్టి గర్భస్రావములు ప్రస్తుతం మన సంఘంలో జరుగుచున్నవి గనుకను, ప్రభుత్వం తనశాసనములతో వాటిని సమూలముగా నాశనము చేయలేకపోయినది గనుకను వాటిని చట్టసమ్మతంచేయమనడం హత్య, దొంగతనము సంఘమున నేటికిని విరివిగా జరుగుచున్నవిగనుకను, ప్రభుత్వం తన వేయిచేతులుచాచి కూడ వానిని మొదలంట పెరికివేయలేక పోయినదిగనుకను అట్టి హత్యాచౌర్యములను చట్టసమ్మతముచేయుమని నట్లున్నది. అయితే సంఘదౌర్భాగ్యకారణమగు ఈ విషయము నేవిధముగా ఎదుర్కొనవలెననునది ప్రస్తుతప్రశ్న. అనర్థదాయకములు, జుగుప్సాకరములునగు గర్భస్రావములను శాసనసమ్మతం చేయుటకంటె, ఇట్టి అక్రమగర్భధారణముచే పుట్టిన బిడ్డలను శాసనములద్వారా సంఘసమ్మతులనుచేసి వారికి పరిపూర్ణపౌరసత్వపు హక్కుల నొసగి వారిపైనను వారి జన్మకారకులగు తల్లులపైనను అత్యాచారముదలంచు సంఘమును శిక్షింపబూనవలెను. ప్రథమమున అట్టి బిడ్డలకు ప్రభుత్వసహాయమునగాని, సంస్కర్తలసహాయమున గాని నెలకొల్పబడ్డ శరణాలయములుండిన ఈ సమస్యాపరిష్కారమునకు మిక్కిలి సహకారకములగును. ఇదికాక వితంతూద్వాహములద్వారా సంఘసంస్కరణము ప్రస్తు

...గుచున్న విధమునసే జరుగవలెను. సంతాననిరోధము బ్రహ్మచర్యము మూలము ...ను, అందుకు శక్తిలేనివారిలో సాధనముల మూలముననను- ఇంకను ఆరోగ్యకరమగు విధమునను వ్యాపించవలెను. వీటినన్నింటిని దాటి యింకను రహస్యగర్భములు కలిగినయెడల పై జెప్పిన విధమున బిడ్డలను కని వారికికూడ ఈప్రపంచమున తదితరులతో సమానహక్కులను కలిగించవలెను. వీటికి నైతికధైర్యస్థయిర్యములుండవలెను. అట్టి బిడ్డలను కనుటకును, ఈసమస్య నెదుర్కొనుటకును అచలితమగు శక్తి ధైర్యములుండవలెను. అంతేకాని అవి అసాధ్యములు మాత్రముకావు. కనుక ఈ సందర్భములలో అప్రాకృతము, అనారోగ్యకరము, అపాయకరము, అవినీతికరమునగు గర్భస్రావములు శాసనసమ్మతముకావడమను మాట మన తలంపుల కామడ దూరమున విడువవలెనని నాయభిప్రాయము.''

—సత్యనారాయణ, బి. ఏ., బి. యల్.

౨

''ప్రస్తుత సంఘధర్మములకు విరుద్ధమగురీతుల గర్భములదాల్చి, కని పారవైవబడునట్టియు బ్రతికియుండగనే పాతిబెట్టబడునట్టియు బిడ్డల తల్లులను పైవ్యాసమున రెండు తరగతులుగ విభజించినట్లగుపడుచున్నది. (1) వితంతువులు, (2) భర్తచే విడువబడిన స్త్రీలు. ఈ పై తరగతుల స్త్రీల గర్భధారణము సంఘ మంగీకరింపదు. గర్భధారణయను ఫలితమునకు కారణము ప్రకృతివాంఛయే యని చెప్పబడినది. మానవులు ప్రకృతిని నిరాకరించుట అసంభవమనబడినది. కనుక మానవకల్పితమగు సంఘము అంగీకరించుటయు మానుటయు నొక గొప్ప అంశమేకాదు. గర్భముదాల్చుట కర్మవశమున అయినచో బిడ్డను కనుటయు కర్మవశమే, పెంచుటయు కర్మవశమేయగును. సంఘము దుయ్యబట్టుకొన్నప్పుడు తానుచేసిన యధర్మ (సంఘదృష్టిలో) కార్యమునకు ప్రకృతియు, కర్మము కారణమని తెలియజేసి సునాయాసముగా సంఘమును నోరుమూయించవచ్చునే. తాను కడుపారగన్న బిడ్డయెడ రాక్షసభావము నూనవలసిన వవసరమేలేదే. లేదు సంఘమునకే యొడంబడి ధర్మప్రవర్తనకే కంకణము కట్టుకొన్నచో వాంఛలకు లోబడుటయెట్లు? ప్రకృతినైనను అనుసరించవలెను లేదా ప్రకృతికి విరుద్ధమయినను సంఘమునకైనను లోబడవలయును. రహస్యముగను, సంఘమునకు విరుద్ధముగను గర్భధారణ గావించుకొని హేయముగ చూడబడుట కంటెను విధవలను, మగనిచే విడనాడబడిన స్త్రీలను విధవావివాహముల వలనను, మారుమనువుల వలనను సంఘమున లేకుండ జేయవచ్చును. అప్పుడు బహిరంగముగను ధైర్యముగను బిడ్డల కనవచ్చును. అట్టి సంఘసంస్కరణ జేయుట మానివేసి ''మే మవినీతికరములగు పనులను రహస్యముగ జేయుదుము, వాని నొనరింపించుటకు న్యాయశాస్త్రము వచ్చి మాకు గొడుగుబట్టవలయు'' ననుటకంటెను దారుణము మరియొకటి లేదు. రహస్యగర్భధారణ న్యాయమే యైనచో ధైర్యముగ సంఘము నేల నిరాకరించరాదు? సరే, న్యాయశాస్త్రమువచ్చి అట్టి స్త్రీలను రక్షించుననియే అనుకొందము. శరీరశాస్త్రము, ఆరోగ్యశాస్త్రము మాటయేమిటి? గర్భస్రావ[illegible]గు సంకటము లనేకములు. అందు క్షయ మొదటిది. వాటివలన స్త్రీలకు, వారివల[illegible]నకు వేయేల ప్రపంచమంతటికిని నష్టమే. వ్యాసమున ఈ సందర్భ

మున మరికొన్నిరీతుల స్త్రీలనుగూర్చికూడ వివరింపబడినది. వారు ఆరోగ్యభంగభయమున, దారిద్ర్యభయమున సంతానమక్కరలేనివారు. ఏస్త్రీయైనను తనకు సంతానమక్కరలేదని భావించుచో తత్కార్యసాధనమునకు సంతాననిరోధకమార్గము లనేకములున్నవి. పై కారణములే మూలములైన ఎడల ఆసాధనముల నేల యవలంబింపరాదు? అందులకు సమ్మతించకుండుటకు సంఘమున కేవిధమగు హక్కునులేదే. ప్రభుత్వమువారుకూడా దానిని సిఫారసుచేస్తూ 'బర్తుకంట్రోల్ క్లినిక్సు'ను నియమించుచునే యున్నారు. ''మేము కామమునకు లొంగిపోయి ఎట్టిగడ్డినైనను కరచి గర్భధారణము గావించుకొందుము. అట్టి గర్భధారణ మీసంఘము ఒప్పుకొనకున్నది. కనుక క్రొత్తలా తెచ్చిపెట్టి ప్రభుత్వమువారు మమ్ము కనికరించి రక్షింపవలెను'' అనుట అవినీతికరమగు కోర్కెను కోరుటయే. కీ॥ శే॥ కందుకూరి వీరేశలింగం పంతులుగారు మొదలగు మహనీయులు స్త్రీ లిట్లనేకదురవస్థల పాలయి సంఘమును పాడుచేయుదురను దూరాలోచనగల్గియే సంఘమునే తగురీతిని సంస్కరించుట శ్రేయమనిరి. అట్టి మహాత్ములు వేసిన విత్తులు నేటికి మొక్కలై పరిణమించుచున్నవి. ఆమొక్కలనే మనము సంరక్షించి మహావృక్షముల జేయవచ్చునే. అట్టితరి ఈ పై విధములగు వ్యాసములకును అందున చర్చలకును అవసరమేగలుగదు. కనిన బిడ్డలను చంపినచో శిక్షించునట్టి న్యాయశాస్త్రమే గర్భస్రావముచేసికొనినగూడ శిక్షించును. గర్భముదాల్చుటయనగా మరియొకప్రాణి యుత్పత్తియగుటయే గనుక గర్భస్రావముగూడ హత్యయే. హత్య పాతకము కాదనజాలము గనుక గర్భవిచ్ఛిత్తి చేయించుకొను లేక చేసుకొను హక్కు స్త్రీలకెట్లీయనగును? స్త్రీల రహస్యగర్భధారణమును ప్రోత్సహించుమని ప్రభుత్వమును ప్రార్థించుటకంటె అసందర్భ మింకొకటి కానరాదు. గర్భస్రావము మున్నగునట్టి దారుణకృత్యములు చేయువారిని చేయించుకొనువారిని గూడ ఇప్పటిరీతినే కఠినశిక్షకు పాత్రుల గావించుచుండవలయును. శిక్షలు ఎంత కఠినముగానున్నను క్రొత్తనేరములు సంభవించుచునే యుండును కనుక శిక్షించుటనే మానుకొనమనరాదు. హంతకులను నిర్మూలమొనరించినను హత్యలు తగ్గలేదని హంతకులను శిక్షింపకుండుడనుట ఎంత సబవుగానుండునో; గర్భవిచ్ఛిత్తి చేసికొనువారిని అందుకు సహాయులను క్షమింపుడనుటయు అంత సబవుగనే యుండును. వ్యాసకర్త్రి యుద్దేశము సంఘముయొక్క హీనత్వమును తెలుపుటకైనట్లున్నది. అట్లగుచో ఇట్టి దార్జన్యము తొలగించుటకు వేరుదారులు త్రొక్కుటకంటె నిందార్హమగు సంఘమునే సంస్కరించుకొనుట సర్వోత్తమము.''

—జగన్నాథము.

## 3

''ప్రపంచములో గర్హింపదగిన విషయములును, సంఘము బహిష్కరించు విషయములు రెండున్నవి. అవి దొంగతనము, వ్యభిచారము. రెండింటిలోన వ్యభిచారము ఎక్కువ నిరసింపదగినది. వ్యభిచారమనునది సంఘవిరుద్ధమైన విషయము. ఎవల్లకల్లు గర్భములను విచ్ఛిన్నము చేసికొనుట ప్రభుత్వవిరుద్ధమైన విషయము. ప్రభుత్వమువారు కఠినశిక్షలు విధించుచున్నారంటే అట్లు విధించుట న్యాయమే. దొంగతనమునకు విధించినప్పుడు దీనికి విధించక

తప్పుతుందా ? అట్లు విధించుట న్యాయమేకాదా ? గర్భస్రావముచేసికొను హక్కు యుండిన యెడల స్త్రీలు నిర్భయముగా, స్వేచ్ఛగా విహరించెదరు. (స్త్రీలనగా ప్రస్తుతమునుబట్టి విధవలు, భర్తలచే విడవబడినవారు.) అందువలన జబ్బులపాలగుదురు. అనేక అనర్థములు కలుగును. దొంగతనమునకు ఎంతశిక్ష ననుభవించుచున్నామో, అంతకంటె హెచ్చు శిక్ష గర్భస్రావమునకును, వ్యభిచారమునకును అనుభవింపక తప్పదు. పాపపుపనులను చేయుచున్నామని జ్ఞానులైనవారికి తెలిసికూడా ప్రభుత్వమువారిని ప్రోత్సాహించమనుట కేవలము సాహసము. ప్రభుత్వమువారిని శిక్షలుతీసివేయమనుటకంటె, శీలమునుగురించి విధవలకు బోధించి వారిని సద్వర్తనులనుగా చేయకూడదా? వారిసంఖ్య తగ్గించుటకు శారదాబిల్లును అమలులోనికి బాగా తేగూడదా? మనమామాత్రము పాటుపడకూడదా? గర్భస్రావము హక్కు వస్తే వ్యభిచారముచేస్తేగర్భమువస్తుందనేభయము స్త్రీలకు పోతుంది. అందుతో ప్రత్యక్షముగ వ్యభిచారము పురికొల్పబడినట్లు అగును. వ్యభిచారమనున దొక పరిపాటి అవుతుంది. కావున గర్భస్రావపు హక్కు మనకువద్దు.

—పామర్తి శీతమ్మ.

## ౪

ఈలోకాన్ని పరిశీలిస్తూవుంటే ఒక విశేషం కనబడుతుంది. ప్రేమగల దంపతులకు కలిగే బిడ్డలు అదృష్టవంతులుగా వుంటారనీ, ప్రేమలేనిదంపతులకు కలిగేబిడ్డలు దురదృష్టవంతులుగా వుంటారనీ. అందచందాలలోకూడా ఈసూత్రం చాలావరకూ వర్తిస్తుంది. ఇప్పుడు ఒకదంపతులు బిడ్డలను కోరుకోరనుకోండి.అటువంటి సందర్భంలో వారికికలిగే బిడ్డలు అదృష్టవంతులుగా వుండరు. బీదవాళ్ళకి విశేషంగా బిడ్డలుండవలసినఅవసరంలేదు, భాగ్యవంతునికి కూడా అనవసరంగా అధికంగా సంతానముండవలసిన అవసరంలేదు. ముఖ్యంగా బీదవారు తమపిల్లల్ని పోషించలేరు. అటువంటి స్థితిలో వారికి సంతానం అధికంగా కలిగితే, ఆ అధికంగా కలిగిన సంతానానికీ నష్టమే, బిడ్డలిని పోషించలేక తల్లి దండ్రులకీ నష్టమే.సంతానాన్ని కోరుకోనప్పుడు గర్భనివారణన ఉపయోగించాలి-బీదవారు జన్మనిగ్రహపద్ధతులు ఎరగవలసిన అవసరం ఎంతోవుంది. అటువంటి సమయాలలోకూడా గర్భంకలిగితే గర్భస్రావంచేసుకొని, కలిగే బిడ్డను దురదృష్టంనుంచీ, తమ్ము అసౌఖ్యంనుంచీ రక్షించుకోవాలి. గర్భస్రావం గర్భంవచ్చిన రెండుమూడు నెలలలోనే జరిపితే మంచిది. ప్రభుత్వంవారు ఇప్పుడు ఇటువంటి పనులకు ఒప్పుగోటంలేదు. స్త్రీలు, పురుషులూ కూడా సభలుచేసి శాసనసభ్యులచేత ఈ విషయమై పనిచేయించి గర్భస్రావంచేసుకొనే హక్కు సంపాదించాలి. గర్భవిచ్ఛిత్తి మంచి దని అనేకమంది ఎరిగినప్పటికీ ధైర్యంగా నలుగురిలోనూ చెప్పగలిగినవారు చాలా తక్కువ. ఫిబ్రవరి "ఆంధ్రభూమి"లో బి. వెంకటలక్ష్మమ్మగారు ధైర్యంగా "గర్భస్రావంచేసుకొను హక్కు ఉండవలెను" నే వ్యాసం రాశారు. వారు జంకకుండా తమఅభిప్రాయాన్ని లోకానికి వెల్లడిచేసినందుకు వారిని ఎంతో అభినందిస్తున్నాను.

—టేకుమళ్ళ కామేశ్వరరావు, బి. ఏ; బి. ఇడి.

# యడవల్లి సూర్యనారాయణ—దుర్యోధనుడు

రచయిత:
ఏ. వి. సీతారామయ్య, యం. ఏ.

[ఆంధ్రనాటకరంగమున దుర్యోధనపాత్రను ధరించి జయప్రదముగ నిర్వహించి ఈ పాత్రధారణమున 'కితనికితండె సాటి' అని అనిపించుకొన్న ఆంధ్రనటావతంసులలో శ్రీయుత యడవల్లి సూర్యనారాయణగారు తొలుత పేర్కొనదగినవారు. ఇపుడు ఆంధ్రలోకమును మహనీయముగ రంజింపజేయుచున్న సరస్వతీటాకీస్ వారి ద్రౌపదీవస్త్రాపహరణముటాకీయందు వారు ధరించిన దుర్యోధనపాత్రనుగూర్చి ఈవ్యాసము పర్యాలోచించుచున్నది. ఢిల్లీసుల్తాను యొక్క బందీనుండి ఆంధ్రరాజు ప్రతాపరుద్రుడు విడిపింపబడునాడు ఆంధ్రునిప్రజ్ఞను, మొగలాయిచక్రవర్తుల ఆస్థానమును రసగంగాలహరిలో దేల్చిన జగన్నాథపండితరాయలకాలమునాడు ఆంధ్రునివైదుష్యమును చవిచూచియుండిన ఢిల్లీనగరము నేడు ఈసరస్వతీటాకీసువారి ద్రౌపదీవస్త్రాపహరణముటాకీప్రదర్శనమూలమున ఆంధ్రునినాట్యకళాకౌశల్యమును గుఱుతెఱింగినది. భారతరాజధానీనగరమున ప్రదర్శితమై ఆంధ్రనాట్యకీర్తికి రాష్ట్రేతరభాగములందు కూడ దివ్యతరప్రచారమును తెచ్చిన ఈద్రౌపదీవస్త్రాపహరణముటాకీయొక్క విశేషజయమునకు కారణభూతులగు నటరాజులందొకరగు శ్రీసూర్యనారాయణగారి పాత్రధారణమును పర్యాలోచించు ఈవ్యాసమును ఆంధ్రభూమి విశేషమగు ఆమోదముతో ప్రచురించుచున్నది.]

నాట్యకళయొక్క వివిధరీతులను సమగ్రముగా పరిశీలించి, సంస్కృతాంధ్రములందలి కావ్యనాటకప్రబంధాదుల రసావస్థల నవగతముచేసికొని, విద్వాంసుల అభిప్రాయముల గుర్తెరిగి, సిద్ధుల ప్రయోగవైఖరుల సాధించి ప్రసిద్ధనటగాయకుల కళావైదుష్యమును అనుభవించి, నిరంతరకళారహస్యజిజ్ఞాసతో, కళోపాసనగావించుచున్న ఉత్తమాంధ్రనటులలో ముఖ్యుడు యడవల్లి సూర్యనారాయణ!

పండితవంశమున పుట్టినాడు. జననమాది కళాసక్తిగల స్వభావము. దానికితోడు సిరిసంపదలు గలవాడు. సహజమైన కంఠమాధుర్యముగలిగిన యాతనికి గానకళయందలి ఉత్తమసాంప్రదాయముల నన్వేషింపకోర్కె జనించినది. రసాభిలాషికి గావలసిన సౌకర్యములన్నియు ఆతనికి భగవంతుడిచ్చియుండుటచే వ్యయప్రయాసలను లెక్కచేయక భారతదేశమందలి ప్రసిద్ధనటగాయకుల గొప్పదనము నన్వేషించి అనుభవించినాడు. పుట్టుకతోడనే ఆతనియందున్న కళాస్వరూపము అనూతనసంస్కారముతో దేదీప్యముగా వెలుగజొచ్చినది. అచిరకాలములోనే ఆంధ్రదేశమందలి నటరాజుగా వినుతికెక్కినాడు.

జన్మతః ఆతనికున్న సిరిసంపదలు, సిరిసంపదలకుతోడు గాత్రమాధుర్యము. గాత్రమాధుర్యమునకు తోడు అభ్యాసఫలితమైన గానకళాసంస్కారము, వీటన్నిటికితోడు రాచవిగ్రహము, సూర్యనారాయణను ప్రసిద్ధరాజభూమికలకు మొదటితరగతియోగ్యతల నిచ్చినవి. దుష్యంతుడు, వత్సరాజు, సత్యవంతుడు,

దుర్యోధనుడు మొదలగు నాయకపాత్రల నసామాన్యముగ నటించి పండితప్రశంసలను, రాజసన్మానములను, విమర్శకుల మెప్పులను అందుకొనినాడు. అందున ఆతని దుర్యోధనభూమికాధారణము నిరుపమానము!

దుర్యోధనుడు మొదటినుండియు దుర్మార్గుడుగ చిత్రింపబడినాడు భారతకథయందును, దానికిసంబంధించిన నాటకములయందును. అదియైనను ఇతరపాత్రల సంభాషణాదులవలననేగాని దుర్యోధనుని వాచికప్రవర్తనాదులవలన గాదు. పాండవులయెడ నీతనికిగల ఈర్ష్య నైజముగా నెంచబడినది. ఆవిధముగనే వివిధపాత్రల వచనములవలన ప్రకటించబడినది. కాని ప్రధానపాత్రలయొక్క గుణవిశేషములను ఆయాపాత్రలు కథలోని వివిధావస్థలలో మాపు ప్రవర్తనవలన తెలియజేయనగును. అంతియకాని ఇతరపాత్రలవర్ణనలవలన చేయుట రసోత్పాదనకు పాత్రపోషణకు భంగకరము. దీనిని చక్కగా గమనించినాడు సూర్యనారాయణ. తత్ఫలితమే 'ద్రౌపదీవస్త్రాపహరణ' నాటకమందలి ఈతని ప్రసిద్ధస్వగతము!

అంతియగాక దుర్యోధనుడు చక్రవర్తి. వ్యాసమహర్షి మనుమడు. గాంధారివంటి మహాపతివ్రతకుమారుడు. బలరాముని శిష్యుడు. భీష్మాశ్వత్థామాదియోధాగ్రేసరుల మన్ననలను నిత్యము అందికొనువాడు. అటువంటి రారాజు ఈర్ష్యావేశముపొందినను సామాన్యదురహంకారప్రమత్తునివలె సంచరించునా? సోదరులచేత ఆహ్వానింపబడి, పోయి, వారిచేత సామాన్యమానవునికి సయితము క్రోధము రగుల్పగల అవమానము పొంది, అదివరకే పరరాజౌన్నత్యము సహింపని రాచనైజము గేకెత్త, అసూయాగ్రస్తుడగు చక్రవర్తియొక్క ఆంతరంగికహృదయమును తననటనా కౌశల్యముతో విప్పిచెప్పగల్గినాడు. సూర్యనారాయణ! ఎంతసోదరుడైనను రాజరాజే! అటువంటివాని కెటువంటి యవమానములు ప్రాప్తించినవి మయసభాలోకనసమయమున! ఆడువారిచేత నవ్వబడి గేలిసేయబడుటా! రాచబింకముతో నడచుచూ సభాంతరమున నీటబడి తమ్ములచేత హాస్యముగావింపబడుటా? కోపమువచ్చినదన్న ఆశ్చర్యమేమి?

ఇంటికి తిరిగివచ్చినాడు రాజసూయమునుంచి. తదాది ఆతనిమనము వ్యాకులమైనది. పాండవులవైభవము. పైన తనకుగలిగిన యవమానము. అసూయ. కసి. ఫలితముగా బ్రతుకుపై రోత. ఇప్పట్టున సూర్యనారాయణ రారాజుయొక్క దుర్భరమానసికావస్థ కనులకుకట్టినట్లు చిత్రించినాడు. 'భీష్మద్రోణాశ్వత్థామాది యోధానుయోధులందరు నొక్కపాండవభటునకు చాలరు' అని శకునికి తెలియజేయునప్పుడు ఆతని మానసప్రవృత్తి చక్కగా గోచరించినది. సూర్యనారాయణకు కీర్తినిగడించిన పాత్రధారణలలో దుర్యోధనభూమిక ప్రధానము, అందున నాతడు మయసభను చూచివచ్చినపిదప దుర్యోధనుని మానసికప్రవృత్తిని గోచరింపజేయు 'స్వగతము' ముఖ్యము. పాండవుల రాజసూయయాగాచరణమే దుర్యోధనునియందు అసూయను రగులగొల్పినది. మయసభలోని దుర్భరావమానము దానిని క్రోధముగా మార్చినది. రారాజై, నూర్గురుతమ్ములకు అన్నయై, భీష్మద్రోణాశ్వత్థామాది యోధానుయోధులకు ప్రభువై, కర్ణునివంటి యుద్ధకుశలునకు మిత్రుడై కూడ ఇంతటియవమానముపొంది ఏమని జీవింపగలడు? జీవితముమీదనే అసహ్యత జనించినది. మేలుకొల్పవచ్చిన ప్రాతఃకాలయామినులను విదలించినాడు. దగ్గరకు




శ్రీ యడవల్లి సూర్యనారాయణ—దుర్యోధనుడు

వచ్చిన భార్యను దూరముగ నుంచినాడు. ఒంటరివై ఆలోచనలో మగ్నుడై నాడు. ఊరడింపవచ్చిన మామయగు శకునిని సైతము నిరసించినాడు. ఆతనికి పాండవులపై కసి దీర్చుకొనునంతవరకు మనశ్శాంతి యెక్కడిది?... శకునిసలహా నచ్చినది. నూతనసభాప్రవేశ మహోత్సవవ్యాజంబున పాండవుల రప్పించి జూదమున నోడించుటకు నిశ్చయించినాడు. ప్రతిఘట్టమునందును సూర్యనారాయణచూపిన నటన యద్భుతము.

జూదమాడుసమయమున, తనకు మయసభలో జరిగిన అవమానమునకు ప్రతీకారము జరుగుచుండ నాతనియానందము రాచమర్యాద నతిక్రమించకుండ దర్పముగా నున్నది. పంచభర్తృకయగు ద్రౌపదిని సభకు దీసికొనివచ్చి యవమానపరుప యత్నించునపుడు, అట్టిపని కొడిగట్టిన నృశంసులవంశము నశమొందునని విదురుడు సూచించినపుడు "మానరక్షణమో, వంశనాశమో' 'జరుగవలెనను దుర్యోధనుని దీక్షావాక్యములయందలి గాంభీర్యము, పట్టుదల, పతితుడై పోవుచున్న ఒక ప్రసిద్ధపురుషుని మానసికస్థితి సూర్యనారాయణ చక్కగా చిత్రించినాడు. ఒకతలవిదలింపుతో దుశ్శాసనునకు సూచనగావించినాడు.

చిరస్థాయిగా నుండదగిన సూర్యనారాయణ దుర్యోధనభూమికాధారణము సరస్వతీ టాకీసువారి 'ద్రౌపదీవస్త్రాపహరణమున' స్థిరత్వము పొందినది. రంగస్థలమునకంటె 'తాపీగా నటించుట' (Controlled acting) యవనికిమీద ఎక్కువగా అవసరము. అది అభ్యాసమున తక్కువపమో తనఅభినయము పూర్తివికాసము పొందకున్నను తనపేరును నిల్పుకొనినాడు సుప్రసిద్ధదుర్యోధన భూమికాధారుడు సూర్యనారాయణ !


## ధన్వంతరినిఘంటువు.

నిఖిలాయుర్వేదసారసర్వస్వవేదియగు ధన్వంతరిచే రచియింపబడిన నిఖిలపదార్థనామగుణ ప్రతిపాదకమైన వైద్యనిఘంటురత్నము. ఇది సింగరాజు కామాశాస్త్రులవారిచే ఆంధ్రీకరింపబడినది. గవర్నమెంటు ఇండియన్ మెడికల్ స్కూలులో ఉపాధ్యాయులుగా నుండిన కీ. శే. ఆయుర్వేదవిశారద, ఇ. సో. తి. వేంకటాచార్యులు, ఏ.ఎం.ఏ.సి. వారిచే పరిష్కరింపబడినది. ఈ గ్రంథముయొక్క ఐదవకూర్పు ప్రతులు చాలరోజులక్రితమే అయిపోయినవి. వాని ప్రతులకొరకు ఈనడుమ పలువురు వ్రాసి ఆశాభంగము పొందియున్నారు. ఇపుడు ఆరవకూర్పు ముద్రించియున్నాము. పిడుగువారి వైద్యగ్రంథముల ప్రసిద్ధినిగూర్చి మీకు ప్రత్యేకముగ చెప్పనక్కరలేకనే తెలిసియున్నది. కావున ఈ గ్రంథమునకు వెంటనే ఆర్డరుపంపవలసినది. ప్రతిఒక్కింటికి వెల రూ. 2-8-0.

పిడుగు - వేంకటకృష్ణారావు పంతులు,

2/40. పెద్దినాయని వీధి, మింటుబిల్డింగ్సు, మదరాసు.

జి జ్ఞా స

విజ్ఞానసంపాదనావసరమున వివిధవిషయములందు కలుగు సందేహములను నివారించుకొొన ప్రతికొముఖమున జిజ్ఞాస సలుపుటకును—ఇందలి ఏ ఒక్క జిజ్ఞాసకైననుసరే సరియైన సమాధానము తెలిసియున్నచో దానిని కూడినంత సంగ్రహముగ వ్రాసి, ప్రచురణార్థము పంపుటకును ఆంధ్రభూమి పాఠకులను ప్రార్థింతుము. —సంపాదకుడు.

మీ మాం స

### ౮౨. గర్భస్రావానంతరకృత్యములు

గర్భస్రావమైనపిమ్మట తిరిగి గర్భముధరించుటకు ఎంతకాలము వ్యవధిఉండిన మంచిది? తిరిగి గర్భస్రావము కాకుండ తీసికొనతగిన మెలుకువలుఏమి?

—దుళ్ళ సత్యవతీదేవి.

### ౮౩. వృద్ధపురుష పునర్వివాహము

హిందూసనాతనిష్ఠవృద్ధులు భార్యచనిపోయినను, లేక జీవించియున్నను స్మృతికార్ల సూత్రముల నతిక్రమించి కన్యలను పునర్వివాహములు చేసికుంటూవున్నారు. వీరికి శాస్త్రసమ్మతమైన శిక్షఏమి? సంఘబహిష్కారమేనా?

—బేతిరెడ్డి గోవిందరెడ్డి.

### ౮౪. రంగాజీ : మోహనాంగి

ప్రాచీనాంధ్ర కవయిత్రులలో రంగాజీ, మోహనాంగిఅను పేరుగలవారుండిరా? ఉండినచో వారు ఏగ్రంథములు రచియించిరి? వారెప్పటివారు? ఎచ్చటివారు?

—అడిదము వేంకటరామారావు.

### ౮౫. అభ్యంగస్నానము సౌందర్యనాశకమా?

అభ్యంగస్నానము సౌందర్యవర్ధకమని ఎల్లరంగీకరించినదే. ఇందుకు విరుద్ధముగా- తనసౌందర్యముచేత దేవలోకవాసియగు ఊర్వసినికూడ భూలోకమునకు ఆకర్షించిన పురూరవచక్రవర్తి అభ్యంగస్నానము వలన సౌందర్యము గోలుపోయెనను పురాణకథ కలదని ఒక రనుచున్నారు. అట్టికథ నిజముగా కలదా? ఉన్నచో అది అభ్యంగస్నానమువలననే పురూరవుడు సౌందర్యము పోగొట్టుకొనెనని చెప్పుచున్నదా?

—తిరువీధుల తాయారమ్మ,

### ౭౯. బల్లిపాటు ఫలములు

ఇవి స్త్రీలకును పురుషులకును కూడ చెప్పబడినవి. స్త్రీసంభోగము స్త్రీలకు సంభవింపనిమాట వాస్తవమే. అంతమాత్రముచేత స్త్రీలకీఫలములు వర్తింపవని చెప్పుటకు వీలులేదు. అట్లు చెప్పుచో నొకచిక్కువచ్చును. 'నాసికాయాం సౌభాగ్యం' అని కలదు. ముక్కుమీద బల్లిపడుచో నయిదవతనము హెచ్చగునని దీనికర్థము. ఇది పురుషులకు వర్తింపదు. అంతమాత్రముచేత బల్లిపాటుఫలములు పురుషులకు చెప్పబడలేదనరాదు కదా! ప్రత్యేకము పురుషులకుగాని స్త్రీలకుగాని వర్తించుఫలములు దక్క మిగిలినవన్నియు నందఱకు సామాన్యమేయని చెప్పవలెనని దీనివలన తేలుచున్నది. పతనస్థల విషయమున గూడ నీవ్యవస్థను గుర్తెఱుగవలెను. 'స్తనయోస్త్రీదోషః' అని కలదు. స్తనములమీదపడుచో దోషమని దీనికర్థము. దీనింబట్టి గౌళీపతనప్రశంస జవరాండ్రవిషయముననేకాని పురుషులవిషయమున చేయబడలేదని తలచుటకు వీలులేదు కదా!

### ౭౬. కందాయఫలమునగ్గరా

ఒకనికొక సంవత్సరమందు నాదాయముకంటె వ్యయము మూడురెట్లు హెచ్చుగనుండునని చెప్పినంతమాత్రమున వానికాయేడేమైన ధనలాభము కల్గునో కల్గదో తేలదు. సాధారణముగ ప్రతిసంవత్సరముననువానికుండు నాదాయమే యీ సంవత్సరముకూడ నున్నను క్రొత్తగనేదైన నార్థికలాభము వచ్చిపడినను గూడ వ్యయము ఆదాయమునకు మూడురెట్లుండుట తప్పదని యాదాయవ్యయపట్టిక చెప్పుచున్నది. కాని లాభము వచ్చునో రాదో చెప్పుటలేదు. ఈ విధముగ నాదాయవ్యయపట్టిక చెప్పకుండ వదలివైచిన విషయమును కందాయఫలము చెప్పుచున్నది. దానివలన నార్థికలాభము కల్గునని తెలియుచున్నది. కాన కందాయఫల మాదాయవ్యయపట్టికకు పూరకముకాని విరుద్ధముకాదు.

—జటావల్లభుల పురుషోత్తము, ఎం. ఏ.

# కారప్పూసనగలు

ఒక్కొక్క ఈతకి ఏనుగు ఒకపిల్లని, సింహం మూడుపిల్లల్ని, పెద్దపులి ఐదుపిల్లల్ని, పంది పది పిల్లల్ని పెడుతుంది అంటారు. ఇందులో మనస్త్రీలు ఇంతవఱకూ ఒక్కఏనుగునేపోలి ఉండేవారు. ఒక్కొక్కప్పుడు అరుదుగా కవలపిల్లల్ని కనడంకూడా ఉండేది. కాని ఇప్పుడు మానవజగత్తులో జన్మనిగ్రహాన్నిగూర్చిన ప్రచారం హెచ్చుఅయినకొద్దీ మన స్త్రీలు తమవ్యక్తిస్వాతంత్ర్యాన్ని ప్రకటించుకోడానికి ఒకేకాన్పున సింహాల్లాగు ముగ్గురేసిపిల్లల్ని, పెద్దపులుల్లాగు ఐదుగురేసిపిల్లల్ని, పందుల్లాగు పదుగురేసి పిల్లల్నికనడం ప్రారంభించారు. కొన్నాళ్ళక్రితము దియోనీలో ఒక స్త్రీ పెద్దపులిలాగు ఒక్కసారి ఐదుగురుపిల్లల్నికన్నది. ఈరికార్డునుకూడ తలదన్ని ఈ నడుమ బరోడాసంస్థానంలో ఉలాఖ గ్రామంలో ఒక స్త్రీ ఒక్కసారిగా ఏడుగురుబిడ్డల్ని కన్నది. ఈ ఏడుగురు బిడ్డల్లో ఇద్దరుమాత్రమే మగపిల్లలు; మిగిలిన ఐదుగురూ ఆడపిల్లలు. ఈ ఐదుగురు ఆడపిల్లలూ పెద్దవారైనతరువాత తల్లిపోలికేవచ్చి ఒక్కొక్క కాన్పుకే ఏడుగురేసి చొప్పున పిల్లల్ని కనడం ప్రారంభిస్తే వేపా రామేశంగారిలాంటివారు లక్షమంది సంతాననిరోధప్రచారం ఎంతతీవ్రంగా చేసినా ఏమీ ప్రయోజనం ఉండదని మనవిచేస్తాను.

... ... ...

హైదరాబాదులో త్యాగరాజోత్సవ సందర్భంలో ఆఖరురోజున చెప్పబడిన సీతాకల్యాణం హరికథలో గౌతమవేషధారి అయిన ఇంద్రుడు అహల్యను కామానికి ఎట్లు ప్రేరేపించెనో విస్తరిస్తూ ఉండగా ఒకరు లేచి సోదరీమణులు ఉన్నారుకాబట్టి అట్టి శృంగార వర్ణన విపులపరచవద్దని కోరగా దాసుగారు మానివేశారు. ఇటీవల నెల్లూరులో జరిగిన మొల్లజయంతి సందర్భమందు నిండుసభయందు సోదరీమణుల సమక్షాన్ని ఒక విద్యార్థికుడు శృంగారపద్యాలు చదివి వినిపించాడు. ఎవరుకాని ఆయన్ని మానమనలేదు; చివరకంటా చదివితేగాని ఆయన మానలేదు. దీనికి కారణం హైదరాబాదు తెలుగువారికంటె మనం హెచ్చు నాగరికులం, హెచ్చు విద్యావంతులం అవడమే.

... ... ...

ఒక ప్రకటన—'వరుడు కావలెను: కన్యవయస్సు 14 సంవత్సరములు. పిల్ల అందకత్తె. కాని వినికిడి కొంచెము తక్కువ. మాటలోపము క్రమముగ చక్కపడుచున్నది. ఈపిల్ల పేరట కొన్నివేల రూపాయిల డిపాజిట్టుకలదు. పిల్లకు 18 సంవత్సరములు నిండినవెంటనే ఆ మొత్తము ఆమెస్వాధీనమగును. వెంటనే దర్ఖాస్తులు పంపదగును.'—ఇంతవఱకూ పెళ్ళికాకుండా ఉన్న చిత్రకారులకు మంచి అవకాశం చేకూరింది. ఈపిల్లను పెళ్ళాడిన చిత్రకారుడికి మోడల్‌గా ఉంచుకోదగిన మనిషినిగూర్చి ఇబ్బంది ఏమిన్నీ ఉండదు. పిల్ల అందెకత్తె కాబట్టి మోడల్‌కు బాగా ఉపకరిస్తుంది. వినికిడి తక్కువైనా, మాట్లాడడం లోపమైనా మోడల్‌గా ఉండడానికి అడ్డంరాదు. చేతిసంజ్ఞలతోటే అభిప్రాయవ్యక్తీకరణం జరిపించుకోవచ్చు. ఆర్టిస్టుకు వుపయోగించినట్లు ఈమె ఇతరవృత్తిగల భర్తకు వుపయోగపడలేదు. కాబట్టి ఆంధ్రచిత్రకారుల్లో ఎవరో ఒకరు ఈమెను వెంటనే వివాహంఅయి మోడల్‌గావుంచుకొని నాలుగేళ్ళపాటు చిత్రాలు చిత్రించి డబ్బుస్వాధీనమవడంతోటే వాటిని ప్రదర్శనాలకు పంపించడం, విదేశాలకు పంపి ముద్రించి తెప్పించడం మొదలైనవి చెయ్యవచ్చు. కాబట్టి చిత్రకారులు వెంటనే ఈ విషయమందు తమతమ అదృష్టాల్ని పరీక్షించుకొందురుగాక!

... ... ...

సెగరోగమును కుదుర్చుటకైన మందునుగూర్చి

ఒకప్రకటన—'జీర్ణించిన సెఫు సవాయిలకు : ఈశ్వరునకు త్రిశూలం, విష్ణునకు చక్రమువలెనే మాకీ వెనీరియల్ గన్ స్వంతాయుధము. ఇది మాకు స్పెషలు.' ఈప్రకటన చూడ్డంతటస్థిస్తే శివుడున్నూ, విష్ణువున్నూ ఏమనుకుంటారో? మనస్సులో ఏమనుకున్నా పైకిమాత్రం కోపపడరనుకుంటాను. ఏమంటే శివవిష్ణులలో ఈవిషయాన్నిగూర్చి ఏమాత్రం కోపలక్షణాలు పైకి కనిపించినా ఈప్రకటనకర్తలు తమ స్వంతాయుధాన్ని వారిమీదికి జారీచేయవచ్చు. సాయుధులతో యుద్ధంచెయ్యడానికి అందరికి లాగే శివవిష్ణువులకుకూడా పురాణకాలంనుంచీ భయమే.

... ... ...

కట్టమంచి రామలింగారెడ్డిగారికి మొగంమీద పెద్ద పుట్టుమచ్చ వుంది. నేను హైస్కూలులో చదువుకునే రోజులందు ఒకసారి ఆయన మాస్కూలుకు వచ్చేరు. అప్పుడు నామిత్రుడు ఒకడు రెడ్డిగారి మొగంమీది పుట్టుమచ్చనుచూపి ఈయన చాలా అదృష్టవంతుడన్నాడు. అప్పట్లో నాకా విషయమందు అట్టే నమ్మకం లేకపోయింది. కాని యిటీవల చిత్తూరు జిల్లాబోర్డు అధ్యక్షుని ఎన్నికయందును, కాకినాడ ఆంధ్రరాష్ట్రీయసభాధ్యక్షుని ఎన్నికయందును లాటరీ రెడ్డిగారిపక్షం అవడంతోటే రెడ్డిగారి పుట్టుమచ్చ ప్రభావం నిజమేనని నాకు తోచింది. కాని మాతూర్పుగోదావరికి చెందిన ప్రబుద్ధాంధ్రసంపాదకులకు మాత్రం ఇంకా రెడ్డిగారి అదృష్టం అవగతంకాలేదు కాబోలు రెడ్డిగారు తిరిగి ఆంధ్రయూనివర్సిటీ వుపాధ్యక్షులు కావడాన్ని ప్రతిఘటించారు. ఈ ప్రతిఘటనకూడా వారి హిందీవెల్లువ ప్రతిఘటనలాగా నిష్ప్రయోజనంగా వుండింది. పుట్టుమచ్చలు గుర్తించకుండా సంపాదకుడు కలంనడిపించకూడదని ఇందువల్ల తేలుతూంది.

... ... ...

హిందూదేశమందు ఎందరిదేవుళ్ళకేనా దేవాలయాలున్నాయి, వారివారికి పూజలూవున్నాయి. బ్రహ్మదేవుడికిమాత్రం ఒక్కచోటతప్ప మఱిరెండోచోట ఈ విశాలభారతదేశమందు దేవాలయంలేదు. ఆలయమేలేందే ఆయనగారికి పూజలు జరగడానికి ఇక ఆస్కారంఏది? బ్రహ్మవిషయం ఇట్లాఅవడానికి కారణం ఏమిటి? మరి ఆయన భార్య అయిన సరస్వతికి 'సరస్వతి నమస్తుభ్యం' అని యింటింటా పూజలే. సరస్వతి బాగా చదువుకుంది కాబట్టి ఆమెకు పూజలు ఏర్పడి ఆమెభర్తకు అవి లేకుండాపోయివుంటాయనీ, చదువుకున్న భార్య ఇట్లు మగనికి అపూజ్యత తెస్తుందని ఇందువల్ల స్పష్టమవుతూందనీ పూర్వాచారప్రియుడైన మిత్రుడొకడు అంటున్నాడు. ఈ వాక్యం సత్యదూరమైందని రుజువుచేసి చదువుకున్న భార్యలు తమభర్తలకు అపూజ్యత తేరని నిర్ణయించి చెప్పవలసిన బాధ్యత స్త్రీలఅభివృద్ధికొరకు నిత్యము తంటాలుపడుతున్నామని చెప్పుకొనే వారిపై నిలచి వుంది. బాధ్యత తెలిసిన పెద్దలయితే వారీపనికి వెంటనే పూనుకోవలసి వుంటుంది.

... ... ...

'పాలుతీయుమనిషి'ని గూర్చి ఒకానొక మాసపత్రికలో ఇట్లావ్రాయబడ్డది : "పాలుపితుకు మనిషి మురికిగానుండు వస్త్రములనుధరించి చేతులను శుభ్రముగా కడుగుకొని పాలుపిండవలెను." చేతులు శుభ్రంగా ఉంచుకొన్నట్లే బట్టలుకూడా శుభ్రంగా ఉంచుకుంటే ఏమన్నాప్రమాదంఉందా? 'ఏకాకిగా వెలువడే దినపత్రికల (అదే మాసపత్రికలో మరోచోటి ప్రయోగం)లో' ఇట్లాంటి తప్పులుంటే వుండవచ్చుగాని 'ఏకాకిగావెలువడే' మాసపత్రికలో ఉంటే ఎట్లా? ఇంతకూ 'ఏకాకిగావెలువడే దినపత్రికలు' అంటే ఏమిటి అర్థం? రామచంద్ర!


... ... ...

గతమాసపు 'కారపుశనగ'ల్లో 'జనవరి ఆంధ్రభూమియందు కారపుశనగలు చదివి గృహలక్ష్మి ప్రొప్రయిటరీ సంపాదకులు చేమకూరవాని వాక్యమును పింగళి సూరన్నకు ముడిపెడుతూ సంపాదకీయము వ్రాసిన అప్పటి గృహలక్ష్మి సహాయసంపాదకులగు శ్రీయుత పసుమర్తి కృష్ణమూర్తి గారిని పిలిచి యీ

కొరపుళనగల ప్రస్తావన తెచ్చి అది యొక నెపముగా ఎన్ని వారిని పనిలోనుండి తొలగించినారని తెలియవస్తోంది' అని నేను వ్రాసినదానికి బదులుగా శ్రీయుత కృష్ణమూర్తిగారు ఆంధ్రభూమి సంపాదకులకువ్రాసిన లేఖను ఆసంపాదకులు నాకు పంపినారు. అం దిట్లున్నది: 'సంపాదకమహాశయా! కడచిన యాంధ్రభూమి సంచికయందు కొరపుళనగలలో నన్నుగూర్చి ప్రస్తావించుచు చేమకూరనుడి పింగళికి ముడిపెట్టుటవల్ల నే నుద్యోగమునుండి తొలగింపబడితిననుమాట సత్యముకాదు. ఆముడి నేను వేసినది కాదు కాబట్టి యందువలన నేను తొలగింపబడుట లేదు. అయిన నొకయంశముమాత్రము చెప్పవలెను. అది యేదన ప్రొప్రయిటరుగారీముడివిషయమున మీ సంచికయందు మునుముందు చేయబడియుండిన ఖండనముగూర్చి నాతోమాటాడియుండిరి. అతప్పుడు ముడి వ్రాత శ్రీయుత చదువుల రామచంద్రయ్యగారే వ్రాసియుండుట శ్రీవారెరిగియుండియు మరల నన్ను బిలచి యడుగుటకుమాత్రము నేను విచారించితిని; అయిన మేకపిల్లవంటి యాశ్రితుడను నేనేమి చేయగలను? పొమ్మన్నారు. పోయినాను. అదియు నొక మేలే. ఇందలి యథార్థము కొంతమంది విద్వత్కవితిలకులుమాత్రము రూఢిగ నెరిగియున్నారు. అంతే చాలు—పసుమర్తి కృష్ణమూర్తి.'' కృష్ణమూర్తిగారి వుద్యోగభ్రష్టతకు కొరపుళనగలు కారణంకాదని తెలిసికొనిన్నీ, మరిన్నీ గృహలక్ష్మిసంపాదకులు ఆంధ్రభూమిని చూచి వున్నారనే విషయానికి కృష్ణమూర్తిగారి సాక్ష్యంకూడా దొరికినందుకున్నూ నేను చాలా సంతోషిస్తున్నాను. ఆంధ్రభూమి గృహలక్ష్మిసంపాదకుల దృక్పథాన్ని పడిందోలేదో సంశయాస్పదమే అన్న శ్రీమతి అడపా సుగుణమణిగారు యీ విషయం తెలిసికొందురుగాక! అబిసీనియా చరిత్ర వ్యాసమందు మనమడిని మనమరాలుగా మార్చిన చదువుల రామచంద్రయ్యగారే చేమకూరనుడి పింగళికి ముడివేసినవారని తెలిసిన యీసందర్భముననే తెఱచాటున జరిగిన ముచ్చట్లు కొన్ని నాకు తెలియవచ్చేయి. కాని వాటిని బయటపెట్టే అవసరం నాకు ఇతరులు కలిగిస్తే తప్ప నే నీవిషయమందు ఇంక ఒక్క అక్షరమైనా వ్రాయకూడదనే, ఆంధ్రభూమిసంపాదకుల ఆజ్ఞను నేను శిరసావహిస్తున్నాను.


—వి. విశ్వనాథము, బి. ఏ.

కర్నూలు పురమున రాజవీధి.



5826

# ఆంధ్రభూమి



## ఈ సంచికలో


యుద్ధములో విషవాయుప్రయోగము.
తద్దినాలవిషయంలో కొన్ని మార్పులు.
ఆదర్శప్రాయుడైన భీమాయేజెంటు.
మీకు ఇట్టికూతురు కావలయునా?
నాలెపురుగుల సంభోగమర్మములు.
కళ్ళ పిళ్ళయ్యగారి కస్తూరి కథ.
తిక్కన్నను సమర్థింపగలమా?
తెలుగులో కథలు వ్రాసేవారు.
నక్షత్రాల రాఘవరావు.
ఇంటికన్న గుడిపదిలము.
గర్భస్రావపు హక్కు.
ఆమె ఒకజాతి మనిషి.
మున్నగునవి ఎన్నియో ఉన్నవి.


దీనివెల రెండు అణాలు మాత్రమే.


ధాతు, వైశాఖము : మే, 1936.

సంపుట : 4

ఆంధ్రభూమి ముద్రణాలయము,
వేపేరి, మదరాసు.

సంచిక : 11

[illegible]

# రత్నపురప్రవేశము

[illegible]